
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 13 ఆగస్టు 2025 | 5






రోడ్లు లేవన్నారు.. కొత్త రోడ్లు వచ్చాయి.. వాటర్ ట్యాంక్ పూర్తవలేదన్నారు.. అందుబాటులోకి వచ్చేసింది.. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు.. డ్రెయినేజీ సమస్యా పరిష్కారమైంది.. ఇలా ఒకటేమిటి.. చెప్పిన చాలా సమస్యలకు పరిష్కారం లభించింది. దీనికి కారణం ఎవరంటే ఆ కాలనీ వాసులంతా 'ఆంధ్రజ్యోతి' వైపే చూపిస్తున్నారు.. ఎందుకంటే ఒక కాలనీలో కేవలం 6 నెలల్లో ఏకంగా 10 కోట్ల విలువైన అభివృద్ధి పనులు సాధ్యమా అంటే అయ్యే పనికాదు.. కానీ 'ఆంధ్రజ్యోతి' అడుగుపెట్టింది. సమస్యలకు పరిష్కారం చూపింది. అక్షర విజయం సాధించింది. అదెలాగో మీరూ చదవండి..

అక్షర విజయం

'ఆంధ్రజ్యోతి' అక్షరం అజెండాలో సమస్యలు విన్నారు.. పరిష్కరించారు

- 6 నెలల్లో రూ.10 కోట్ల అభివృద్ధి పనులు
- 9వ వార్డులో పలు సమస్యలకు పరిష్కారం
- ఆ వార్డులోనే 'ఆంధ్రజ్యోతి' సక్సెస్ మీట్
- స్ఫూర్తిదాయకమన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం వెంకటేశ్వరనగర్ 9 వార్డులో ఈ ఏడాది జనవరి 28, 29 తేదీల్లో 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా' వినూత్నమైన కార్యక్రమం చేపట్టింది. ముందుగానే సమస్యలను గుర్తించింది. ఒక సభ నిర్వహించి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, కాలనీ ప్రజలను ఆహ్వానించింది. ఇక్కడ సమస్యలన్నీ ఎమ్మెల్యే విన్నారు.. త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.. 6 నెలల్లో రూ.10 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టారు.. కాలనీ వాసులు ఏం సమస్యలు చెప్పారో, వాటన్నింటినీ పరిష్కరించారు. దీనిలో భాగంగా అదే వార్డులోని ఐఎంఏ హాలులో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌కు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు హాజరై మాట్లాడారు. 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా' వినూత్నమైన, స్ఫూర్తిదాయకమైన (తరువాయి 6వ పేజీలో)





9వ వార్డు ఐఎంఏ హాలులో నిర్వహించిన ఆంధ్రజ్యోతి సక్సెస్‌మీట్‌లో ఆంధ్రజ్యోతి పేపర్ చదువుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు.. హాజరైన కాలనీవాసులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

ఆంధ్రజ్యోతి అక్షరం.. ఆయుధమే..



ఆంధ్రజ్యోతి అక్షరం ఆయుధమే.. ఐఎంఏ హాల్ రోడ్డు ఆరు నెలల కిందట అధ్వానంగా ఉండేది.. ఇప్పుడు సిమెంటు రోడ్డు వేయడంతో రూపురేఖలు మారిపోయింది. పలు సమస్యలు ఒకట్రెండు రోజుల్లోనే పరిష్కారం అయ్యాయి.. మొత్తం కాలనీలో చాలా అభివృద్ధి పనులు జరిగాయి. - కోసూరి చండీప్రియ, మాజీ కార్పొరేటర్



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అన్నదాత సుఖీభవకు అర్హులను గుర్తించండి : కలెక్టర్

అమలాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవన, పీఎం కిసాన్ పథకానికి ఆధార్ మిస్ మ్యాచింగ్ క్రాస్ వెరిఫికేషన్ వంటి ఐదు రకాల అంశాల తనిఖీపై రెవెన్యూ వ్యవసాయశాఖ సిబ్బంది ప్రత్యేక చొరవచూపి అర్హులైన వారికి నిధులు విడుదలకు కృషి చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. అమరావతి నుంచి భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి, కార్యదర్శి ఎన్.ప్రభాకర్‌రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి అన్నదాత సుఖీభవ పథకంపై దిశానిర్దేశం చేశారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల రికార్డుల్లో వివరాలు, విచారణ పంపిణీకి సన్నద్ధతత, కులధ్రువీకరణ పత్రాలు, సుమోటాగా ధ్రువీకరణ, రెగ్యులర్ విచారణ ప్రక్రియలో పురోగతిపై కలెక్టర్లతో సమీక్షించారు. జేసీ నిషాంతి, డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు శ్రీకర్, డి.అఖిల, వ్యవసాయాధికారి బోసుబాబు, సర్వేఏడీ కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

గడువులోగా లక్ష్యాల్ని ఛేదించాలి..

ప్రభుత్వం ప్రాధాన్యత అంశాల లక్ష్యాల సాధనలో జిల్లాస్థాయి అధికారులు కీలకంగా పనిచేసి గడువులోగా వాటిని పూర్తి చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు, ఇతర సిబ్బందితో పలు అంశాలపై సమీక్షించారు. షెడ్యూల్డు కులాల వారికి బరియల్ గ్రౌండ్ల కోసం స్థల సేకరణ, మండలాల వారీగా పట్టాదారు పాసు పుస్తకాల తనిఖీ, పత్రాలు లేని గ్రామ సర్వీసు ఈనాం భూములను సబ్‌రిజిస్ట్రార్ భూ రికార్డుల్లో 20 ఏళ్ల వ్యవధిలో సరిపోల్చి హక్కులను గుర్తించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్, డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు శ్రీకర్, డి.అఖిల, పలు మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

నేడు రాజోలు ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ : ఎంపీడీవో

రాజోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాజోలు ఎంపీపీ స్థానానికి బుధవారం ఎన్నిక జరుగనుంది. ఇక్కడ ఎంపీపీగా ఉన్న కేతా శ్రీను అకాల మృతితో ఆ స్థానానికి ఖాళీ ఏర్పడినందున రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం, ఎన్నిక జరుగుతుందని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రత్యేకాధికారిగా పి.బొజ్జిరాజు వ్యవహరించనున్నారని తెలిపారు. గత నెల 16న కోరం లేక ఎంపీపీ ఎన్నిక గత నెల 17వ తేదీకి వాయిదా పడిన విషయం పాఠకులకు విదితమే. అప్పుడు కూడా కోరం సరిపడక మరోసారి వాయిదా పడడంతో ఎన్నికల అధికారి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మళ్లీ గురువారం ఎంపీపీ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు.

కోనసీమ మళ్లీ.. 'ముక్కలు' కానుందా?



- మండపేటను 'తూర్పు'లో విలీనం చేయాలని ఉద్యమం
- రామచంద్రపురాన్ని కాకినాడలో కలపాలని డిమాండ్
- అదే జరిగితే కోనసీమ జిల్లా ఐదు సెగ్మెంట్లకే పరిమితం కానుందా?
- నేడు మంత్రివర్గ ఉపసంఘం జీవోఎం తొలి భేటీ
- జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ఆసక్తికరమైన చర్చ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం తొలి భేటీ బుధవారం అమరావతిలో జరగనున్న నేపథ్యంలో జిల్లాల్లోని మండలాలు, నియోజకవర్గాలు, సరిహద్దుల మార్పులపై ఆసక్తికరమైన చర్చలు ప్రారంభమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో రెండు ప్రధాన నియోజకవర్గాలను పక్క పక్క జిల్లాల్లో విలీనం చేయాలంటూ ఇప్పటికే అఖిలపక్ష సమావేశాల్లో చర్చించి తీర్మానాలు చేయడంతోపాటు ఉద్యమ కార్యాచరణలకు సిద్ధమవుతున్నారు. ఆ రెండు నియోజకవర్గాల్లో మార్పులు అనివార్యమైతే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిస్థితి ప్రశ్నార్థకమయ్యే పరిస్థితులు ఉన్నాయని నిపుణులు అంచనాలు వేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులపై 13వ తేదీన అమరావతిలో జరిగే జీవోఎం భేటీ ప్రజల నుంచి వినతులకు ఆహ్వానం పలికేందుకు వీలుగా కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో వివిధ శాఖలకు ప్రాతినిధ్యం వహించే మంత్రులతో ప్రభుత్వం నియమించిన ఉపసంఘం తొలి భేటీ జరగనుంది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైసీపీ నేతల సిఫార్సుల మేరకు జిల్లాల పునర్విభజన కార్యక్రమం చేపట్టినప్పటికీ నియమ నిబంధనలు పాటించకుండా అడ్డదిడ్డంగా రాజకీయ సిఫార్సులకు ప్రాధాన్యతనిస్తూ జిల్లాలను ఏర్పాటు చేశారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిని జిల్లాగా ప్రకటిస్తామని అప్పటి ప్రభుత్వం చేసిన ప్రతిపాదన ఆచరణలో అమలు కాకుండా నియోజకవర్గ పరిధిలోని మండలాలను ఇతర జిల్లాల సరిహద్దుల్లో విలీనం చేయడంతో అప్పుడు ఇప్పుడు ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అమలాపురం ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడుగురు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు పట్టణాలు, ఒక నగర పంచాయతీతోపాటు తొలుత 24 మండలాలతో కోనసీమ జిల్లాను విభజించారు. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం స్థానిక పాలకుల సిఫార్సులను దృష్టిలో ఉంచుకుని ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉండే తాళ్లరేవులో కాకినాడ జిల్లా పరిధిలో విలీనం చేసింది. అలాగే రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉండే కాజులూరు మండలాన్ని కాకినాడ జిల్లాలోను విలీనం చేసింది. ఈ పరిణామాలతో లోక్‌సభ పరిధిలో జిల్లా ఏర్పాటు అనే నిబంధనలకు అప్పటి ప్రభుత్వంలోనే తిలోదకాలు ఇచ్చినట్టయింది. దాంతో 22 మండలాలు, ఐదు నియోజకవర్గాలు, మూడు పట్టణాలు, ఒక నగర పంచాయతీతో కోనసీమ జిల్లా ఆవిర్భవించింది. అయితే ఈ జిల్లా పరిధిలో ఉండే రెండు నియోజకవర్గాల్లో ఒక నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలోను, మరో నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లా పరిధిలో విలీనం చేయాలనే డిమాండ్ ప్రస్తుత మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు నేపథ్యంలో ఊపందుకుంది. మండపేట అసెంబ్లీ నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పడ్డ తూర్పుగోదావరిలో ఖచ్చితంగా విలీనం చేయాలంటూ ప్రస్తుత సీనియర్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో అఖిల పక్ష కమిటీని ఏర్పాటుచేసి ఉద్యమ కార్యాచరణ అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా గ్రామ గ్రామాన మండపేటను తూర్పులో విలీనం చేయాలంటూ గ్రామసభల తీర్మానాలు చేసే పనిలో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు. ఇక రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేస్తారనే ప్రచారం ఊపందుకుంది. దాంతో కోనసీమ జిల్లా పరిస్థితి అయోమయంగా మారనుంది. అప్పుడు ఐదు నియోజకవర్గాలతో జిల్లాను కుదిస్తారా, మొత్తం ఉమ్మడి జిల్లా పరిధిలో ఏజెన్సీతో సహా కలిపి జిల్లాలను పునర్వ్యవస్థీకరిస్తారా అనే దానిపై చర్చలు తీవ్రమయ్యాయి.

ఉమ్మడి జిల్లాకు మరో రెండు పదవులు

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మరో 31 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. వీటిలో రెండు కీలక కార్పొరేషన్ పదవులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో లభించాయి. బీసీ సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి కోనసీమ జిల్లాకు, సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్ పదవి తూర్పుగోదావరి జిల్లాకు లభించాయి.

బీసీ సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రెడ్డి అనంతకుమారి



అమలాపురం/కొత్తపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారిని నియమించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. శాసనమండలి మాజీ డిప్యూటీ, ప్రస్తుత టీడీపీ పొలిట్‌బ్యూరో కమిటీ సభ్యులుగా ఉన్న చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం సతీమణి అయిన అనంతకుమారిని ఈ పదవిలో నియమితులు కావడంతో జిల్లాలో ఉన్న శెట్టిబలిజ సామాజిక వర్గీయులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. అనంతకుమారి టీడీపీ జిల్లా అధ్యక్షురాలిగా ప్రస్తుతం కొనసాగుతూ పార్టీని ముందుకు నడిపిస్తున్నారు. ఈమె 1967 మే 3న జన్మించారు. 2014 నుంచి 2019 వరకు కొత్తపేట మండల పరిషత్ అధ్యక్షురాలిగా పనిచేశారు. బీఏ విద్యాభ్యాసం చేసిన ఈమెకు హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉంది. అనంతకుమారి, రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులకు ఒక కుమార్తె ఉన్నారు.

బీసీల అభ్యున్నతికి పాటుపడతా..

రాష్ట్రంలో సగానికి పైగా బీసీలే ఉన్నారని, వారి అభ్యున్నతికి పాటుపడతానని ఏపీ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన రెడ్డి అనంతకుమారి అన్నారు. మంగళవారం ఆమె కొత్తపేటలో మాట్లాడుతూ బీసీ కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించే దిశగా రాయితీలతో కూడిన రుణ సౌకర్యాలు కల్పించి ఆర్థికంగా నిలబడేలా కృషిచేస్తానన్నారు. అలాగే చదువుకునే బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల ద్వారా ప్రోత్సాహం అందిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలోను బీసీ సామాజిక భవనాల నిర్మాణానికి పాటుపడతానన్నారు. ఈ అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్‌గా మందలపు రవి



రాజమహేంద్రవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్‌గా టీడీపీ జోన్ ఇన్‌చార్జి మందలపు రవి నియమితులయ్యారు. వాస్తవానికి ఆయన స్వగ్రామం కృష్ణా జిల్లా పసుమర్రు. అమెరికాలో ఇంజనీరింగ్‌లో బిజినెస్ మేనేజ్‌మెంట్ చేసి, అక్కడ వ్యాపారవేత్తగా ఎదిగారు. గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాజమహేంద్రవరం ప్రాంతంలో పార్టీ తరపున పనిచేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులో ఓటుహక్కు తెచ్చుకుని ఇక్కడే ఉండేలా నిర్ణయించుకుని స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో పార్టీ కోసం ఆయన చేసిన కృషికి గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్‌గా నియమించింది. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడుతూ తమ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, తనను గుర్తించి పదవి ఇచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. తనకు రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి ఈ పదవి లభించిందని రవి చెప్పారు.

అక్రమాల ద్వారం తెరవాలని!





గతేడాది నవంబరులో రేషన్ బియ్యం రవాణా చేస్తూ కాకినాడలో చిక్కిన స్టెల్లా నౌక

రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై ఏర్పాటైన సిట్‌లోకి సీఐడీ

- ఐదోసారి జీవో సవరణ
- ఏకంగా పది మంది పోలీసులకు చోటు
- సీఐడీ నుంచి నలుగురికి స్థానం
- విశాఖ నుంచి ఏసీపీ శ్రీనివాసరావు
- డీఎస్పీ హోదాలో నియామకం
- ఐపీఎస్ ఆకే రవికృష్ణ నేతృత్వం
- స్మగ్లింగ్‌పై లోతైన విచారణకు రెడీ
- మార్పులు చేస్తున్నా దర్యాప్తు శూన్యం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ కేంద్రంగా సాగిన వందల కోట్ల రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై లోతైన విచారణకు రంగం సిద్ధమవుతోంది. బియ్యం కుంభకోణంపై ఏర్పాటుచేసిన సిట్‌కు ప్రభుత్వం తాజాగా మరింత బలం కల్పించింది. స్కామ్‌ను అన్ని కోణాల్లో లోతుగా విచారించడానికి వీలుగా సిట్ బృందంలో పలు మార్పులు చేసింది. ఈ మేరకు మంగళవారం కొత్తగా మరో జీవో జారీచేసింది. సిట్‌లోకి పోలీసులు, విజిలెన్స్ కలిపి ఏకంగా పది మందిని చేర్చింది. వీరిలో నలుగురు రాజమహేంద్రవరం సీఐడీ అధికారులే ఉన్నారు. అయితే బియ్యం కుంభకోణంపై తొమ్మిది నెలల కిందట సిట్ బృందాన్ని నియమించగా.. ఇంత వరకు ఐదు సార్లు మార్పులు చేర్పులు చేశారు.

ఐదోసారి ఏమవుతుందో..

వేళ్లూనుకుపోయిన రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబరు 6న ఉక్కుపాదం మోపింది. ప్రత్యేకంగా సిట్‌ను నియమించింది. కాకినాడ చుట్టుపక్కల ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో గతేడాది జూన్, జూలై నెలల్లో 13 రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. ఈ 13 కేసుల్లో రూ.84.87 కోట్ల విలువైన 22,947 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుబడింది. ఇందులో ద్వారంపూడి అనుచరులే అధికంగా ఉన్నట్టు తేలింది. సిట్ చీఫ్ వినీత్ బ్రిజిలాల్ దర్యాప్తు పూర్తిగా నీరుగార్చేశారు. బ్రిజిలాల్ ఉన్నట్టుండి కేంద్ర సర్వీసులకు డిప్యుటేషన్‌పై వెళ్లి పోవడంతో సిట్ ఆగిపోయింది. కుంభకోణం కథ కంచికే అనుకున్న తరుణంలో మళ్లీ ప్రభుత్వం పాత సిట్‌ను పునర్వ్యవస్థీకరించింది. కొత్త బాస్‌గా ఐపీఎస్ అధికారి ఆకే రవి కృష్ణను నియమిస్తూ మే 7న మరో జీవో జారీ చేసింది. సిట్ సభ్యులుగా సీఐడీ ఎస్పీ అయిన ఐపీఎస్ అధికారి బి.ఉమామహేశ్వర్, కాకినాడ బీసీ వెల్ఫేర్ ఈడీ ఏ.శ్రీనివాసరావు, కర్నూలు ఐసీడీఎస్ ఆర్జేడీ పి.రోహిణి, విజయనగరం డీఎస్‌వో కె.మధుసూదనరావు, కోనసీమ జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.బాల సరస్వతిని నియమిస్తూ ఆదేశాలు ఇచ్చింది. కానీ మళ్లీ అదే తంతు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దర్యాప్తు ఊసే లేదు. గతేడాది డిసెంబరు నుంచీ సిట్‌ను నాలుగుసార్లు మార్చిమార్చి నియమించినా అసలు విచారణ జరగకపోవడం అనుమానాలకు తావిచ్చింది. అంతా మర్చిపోయారనుకున్న తరుణంలో ప్రభుత్వం మంగళవారం మళ్లీ కొత్త జీవో జారీచేసింది. ఇప్పుడున్న సిట్ బృందానికి తోడుగా మరో పది మంది పోలీసులను అదనంగా నియమిస్తూ రాష్ట్రసాధారణ పరిపాలనశాఖ జీవోఆర్టీ నెంబరు 1490 జారీ చేసింది. బృందంలో కొత్తగా డీఎస్పీ హోదాలో విశాఖ పోలీసు కమిషనరేట్‌లో సౌత్ ఏసీపీగా పనిచేస్తోన్న వై.శ్రీనివాసరావును నియమించింది. అదేవిధంగా ఐవోపీగా రాజమహేంద్రవరం సీఐడీ ఆర్‌వో బి.వెంకటేశ్వరావును నియమించింది. కోరుకొండ ఎస్ఐ టీవీఎస్ఎన్ శ్యాంసుందర్, రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ (హెచ్‌సీ) నామల దొరబాబు, కాకినాడ వన్‌టౌన్ హెచ్‌సీ కేఎస్ఎస్ శాస్త్రి, విశాఖ సీఐడీ ఆర్‌వో అయిన హెచ్‌సీ సీహెచ్.శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం సీఐడీ ఆర్‌వో అయిన హెచ్‌సీ ఎ.ఉమామహేశ్వరరావు, రాజమహేంద్రవరం వన్‌టౌన్ కానిస్టేబుల్ ఎం.లోవరాజు, కాకినాడ టూ టౌన్ కానిస్టేబుల్ ఎల్.పరమేశ్వరరావు, రాజమహేంద్రవరం సీఐడీ ఆర్వో కానిస్టేబుల్ ఎం.మురళీకృష్ణను బృందంలో నియమించారు.

డొంక కదిలిందిలా...

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులు ఐదేళ్లలో భారీగా విదేశాలకు తరలించేశారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు బియ్యాన్ని కనివినీ ఎరుగని రీతిలో బొక్కేశారు. పేదల బియ్యాన్ని సార్టెక్స్ యంత్రాల్లో పాలిష్‌చేసి ఆఫ్రికా దేశాలకు అమ్మేసుకుని వేల కోట్లు గడించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-2020లో కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి 19 లక్షల మెట్రిక్ టన్నులు, 2020-2021లో 27 లక్షల మెట్రిక్ టన్నులు, 2021-2022లో 29 లక్షల మెట్రిక్ టన్నులు, 2022-2023లో 38 లక్షల మెట్రిక్ టన్నులు, 2023-2024లో 24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం తరలిపోయింది. ఇందులో రేషన్ బియ్యం సగానికిపైనే. వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, ఆయన ప్రధాన అనుచరుడు వినోద్ అగర్వాల్‌కు చెందిన రెండు కంపెనీలు వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.4,995 కోట్ల విలువైన 13.41లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం విదేశాలకు విక్రయించాయి. గతేడాది నవంబరు ఆఖరులో కాకినాడ నుంచి పశ్చిమ ఆఫ్రికా దేశానికి స్టెల్లా నౌకలో రహస్యంగా ఎగుమతికి సిద్ధం చేసిన రేషన్ బియ్యం పట్టుబడడంతో స్మగ్లింగ్ వ్యవహారం బయటకు వచ్చింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం కాకినాడకు వచ్చి స్వయంగా షిప్ వద్దకు వెళ్లారు.ఆ తర్వాత కాకినాడ, చుట్టు పక్క ప్రాంతాల్లో అనేక గోదాముల్లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుబడింది.

జార్ఖండ్ జయకేతనం

- కాకినాడలో ముగిసిన జాతీయ హాకీ జూనియర్ మహిళల చాంపియన్‌షిప్
- హోరాహోరీగా ఫైనల్ పోరు
- విన్నర్‌గా జార్ఖండ్, రన్నర్‌గా హర్యానా జట్లు

మహానుభావుడు ఎన్టీఆర్

రామచంద్రపురంలో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన సినీనటుడు నారా రోహిత్

7

ఇద్దాం... ప్రాణం పోద్దాం!

మనం చనిపోయాక కూడా పది మందికి ఉపయోగపడాలి.. అప్పుడే ఈ జన్మకు సార్థకత ఉంటుంది. ఇలా ఉపయోగపడాలంటే మనం మరణించాక కూడా బతికుండాలి. అలా బతికుండాలంటే.. మరణానంతరం కూడా మనం కొందరిని బతికించాలి. మనకి ఉపయోగపడని మన అవయవాలు.. కొందరికి ప్రాణం పోస్తాయి.. వారికి బతుకునిస్తాయి. మనల్నీ వాళ్ల రూపంలో మళ్లీ బతికిస్తాయి. ఇలా అవయవదానం చేసే ఒక వ్యక్తి.. నేరుగా 8మందికి ప్రాణదానం చేయొచ్చు. అందుకే అవయవదానం చేసినవారు దేవుడితో సమానం. ఇంత గొప్ప కార్యక్రమంపై చాలామందికి అవగాహన లేదు. నేడు ప్రపంచ అవయవదాన అవగాహన దినోత్సవం.

ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..



- అవయవదానం... అరుదైన అవకాశం
- ప్రజల్లో ఇంకా అవగాహన అవసరం
- మరణించిన తర్వాత మరో 8 మందికి జీవితం ఇవ్వొచ్చు
- అవయవాల కోసం ఎంతోమంది ఎదురుచూపులు
- నేడు ప్రపంచ అవయవదాన అవగాహన దినోత్సవం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చాలా మంది కిడ్నీ బాధితులు ఉన్నారు. వీరంతా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారు. వీరిలో కొందరికి కిడ్నీలు అవసరం. కిడ్నీలు పాడై.. డయాలసిస్‌లు చేయించుకోలేక కిడ్నీ దాతల కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 200 మంది వరకు బాధితులు జీవన్‌దాన్ సైట్‌లో కిడ్నీలు కావాలని తమ పేర్లను రిజిస్టర్ చేయించుకున్నారు. కనీసం ఒక కిడ్నీ ఉన్నా వారు సాధారణంగా జీవించవచ్చు. ఇలానే కొందరికి గుండె అవసరం.. ఇంకొందరికి కాలేయం, ఊపిరితిత్తులు, క్లోమ గ్రంధి.. ఇలా శరీరంలో ఒక్కో భాగంలో లోపం ఉండడం కారణంగా రోజురోజుకూ జీవచ్ఛవాలుగా మారుతున్నవారున్నారు. వీరంతా దాతల కోసం ఎదురుచూడడం తప్పట్లేదు. ఇలా అవయవాలు లభించక ప్రతిరోజూ ఎంతోమంది చనిపోతున్నారు. ఇలాంటి వారికి బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవదానం చేస్తే బతుకుతారు. అవయవదానంపై సరైన ప్రచారం, అవగాహన లేకపోవడంతో ఎవరూ ముందుకు రావట్లేదు. యూఎస్, స్పెయిన్, బ్రెజిల్ లాంటి దేశాలలో ప్రజలు స్వచ్ఛందంగా అవయవదానం చేయడానికి ముందుకొస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మనదేశంలో దీనిపై మరింత అవగాహన పెరగాల్సి ఉంది.

నేత్రదానంపై అవగాహన

నేత్రదానంపై చాలా మందికి అవగాహన ఉంది. మరణించిన తర్వాత మరో ఇద్దరికి చూపునివ్వొచ్చన్న భావనతో ఎంతోమంది నేత్రదానం చేయడానికి ముందుకువస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రజలకు రకదానం, నేత్రదానంపై అవగాహన బాగానే ఉంది. అందులో కాకినాడ, రాజమహేంద్రవరంతో పాటు కోనసీమలోను ఐ బ్యాంక్‌లు ఉన్నాయి. దీంతో నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరికి జీవితం ప్రసాదించవచ్చన్న ఆలోచనతో చాలా మంది ఆయా ఐబ్యాంకుల్లో పేర్లు రిజిస్టర్ చేయించుకుని మరణించిన తర్వాత నేత్రదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ స్థాయిలో అవయవ దానంపై కూడా అవగాహన పెరగాల్సి ఉంది.

గ్రీన్ చానెల్ ద్వారా పునర్జన్మ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అవయవదానం చేసినవారు కొందరు ఉన్నారు. ఒకప్పుడు వందల సంఖ్యలో ఉండే నేత్రదానం ఇప్పుడు వేల సంఖ్యలో ఉంది. అవయవదానంపై అవగాహన తక్కువగా ఉండడంతో డోనార్లు వందల సంఖ్యలోనే ఉన్నారు. ఒక్కోసారి కొందరికి అవయవం అత్యవసరం అవుతుంది. వాళ్లు అప్పటికే జీవన్‌దాన్ సైట్‌లో నమోదై ఉంటారు. వాళ్లు రాష్ట్రంలో ఏ ఆస్పత్రిలో ఉన్నా.. గ్రీన్‌చానల్ విధానం ద్వారా వారికి ఆ అవయవం పంపిస్తుంటారు. ఈ అవయవం ఎలా సేకరిస్తారంటే.. రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా కారణాలతో బ్రెయిన్ డెడ్ వారు అవయవాల దానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మను ఇవ్వొచ్చు. వీరిలో జీవం ఉన్నా మెదడు పనిచేయదు. ఇలాంటి వారు 24 గంటల్లో మరణిస్తారు. ఇలా బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలతో 8మంది ప్రాణాలు రక్షించవచ్చు.

వారికి జోహార్లు

బ్రెయిన్ డెడ్(మెదడు పనిచేయకపోవడం) నిర్ధారణ అయ్యాక అవయవాలు సేకరించవచ్చు. ఇందుకు ప్రథమంగా ఆ వ్యక్తి భార్య, భర్త, కుమారుడు, కుమార్తె, ఇతర కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరించాల్సి ఉంటుంది. వారి అంగీకారం ఉండాలి. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తికి వ్యాధులు, జన్యుపరమైన లోపాలు ఉండకూడదు. ప్రభుత్వ ప్రత్యేక గుర్తింపుగల ఆస్పత్రుల ద్వారా మాత్రమే అవయవాల మార్పిడికి అనుమతి ఉంటుంది. ఇలాంటి దానంవల్ల ఏడు నుంచి తొమ్మిది మంది ప్రాణాలు కాపాడొచ్చు. ఇలా మన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కూడా కొందరు అవయవదానం చేసి మరికొందరికి ప్రాణదానం చేశారు. ఇటీవల కాలంలో కాకినాడ అపోలో ఆస్పత్రి, మెడికవర్ ఆస్పత్రి నుంచి గ్రీన్‌చానల్ విధానం ద్వారా విశాఖలోని ఆస్పత్రులకు రెండు, మూడుసార్లు అవయవాలను పంపించారు.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి

స్పెయిన్‌లో ప్రతి మిలియన్ జనాభాలో 36శాతం మంది అవయవదానం చేస్తున్నారు. ఇండియాలో ప్రతి మిలియన్ జనాభాలో 1.6 శాతంమంది మాత్రమే ముందుకొస్తున్నారు. గతంతో పోలిస్తే అవగాహన పెరిగినా ఇంకా స్వచ్ఛందంగా ముందుకురావాలి. ముఖ్యంగా కుటుంబసభ్యులు చొరవ తీసుకోవాలి. ప్రస్తుతం కాకినాడలో ప్రతినెలా 6000మందికి కిడ్నీ డయాలసిస్ జరుగుతున్నాయి. వీరందరికీ కిడ్నీ మార్పిడి చేస్తే తిరిగి ఆరోగ్యంగా జీవిస్తారు. ఇదే విధంగా మిగిలిన అవయవాలు కూడా. దాతలు ముందుకు రాకపోవడంవల్ల ప్రస్తుతం చాలా తక్కువశాతం మందికి కిడ్నీ మార్పిడి జరుగుతోంది. అవయవదానంపై 20వేల మందితో ప్రతిజ్ఞ చేయించాం. అవగాహన కార్యక్రమాలు 13ఏళ్లుగా నిర్వహిస్తున్నారు.

-బాదం బాలకృష్ణ, ఫౌండర్ చైర్మన్, డాక్టర్ డీవీ రాజు మల్టీఆర్గాన్ ఫౌండేషన్

ఒక వ్యక్తి 18 మందికి..

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలు 18 మందికి ఉపయోగపడతాయి. ఇద్దరికి కళ్లు, ఒకరికి గుండె, ఇద్దరికి కర్ణభేరులు, ఇద్దరికి మూత్రపిండాలు, ముగ్గురికి కాలేయం, ఒకరికి క్లోమ గ్రంధి, గాల్‌బ్లాడర్, గుండె కవాటాలు ఇలా అన్నీ అవయవాలు ఉపయోగమే. ప్రమాదంలో మృతి చెందిన వారి అవయవాలను 4గంటల్లో తీయగలిగితేనే ఉపయోగపడతాయి. మామూలుగా చనిపోయిన వారి నుంచి రెండు గంటల్లో అవయవాలు తీయాలి.



అవయవదానం రెండు రకాలు

బతికున్న సమయంలో ఇచ్చేవారు(లైవ్ డోనార్), చనిపోయిన వారివద్ద సేకరించడం(కెడావర్). లివర్, కిడ్నీ, పాన్‌క్రియా, గుండె, కార్నియా, బోన్‌మ్యారో, కార్డియాలజీ, చర్మం, కాండ్రోసెల్స్, ట్రాన్స్‌ప్లాంట్ ఇలా అవయవాల అవసరాన్ని బట్టి మార్పిడి చేసుకోవచ్చు.

మూడు జిల్లాల్లో తూర్పుగోదావరే అధికం..

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న notto.abdm.gov.in వెబ్‌సైట్ లెక్కల ప్రకారం ఎన్‌జీవోల ద్వారా, వ్యక్తిగతంగా ఇనిస్టిట్యూషన్లు, ఎన్‌ఓటీటీవో వెబ్‌సైట్ ద్వారా అవయవదానం చేయడానికి నమోదు చేసుకున్న వారి వివరాలిలా ఉన్నాయి. ఇప్పటివరకు తూర్పుగోదావరి జిల్లా నుంచి 600 మంది వరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరిలో 18- 30 ఏళ్ల మధ్య వయసున్న వారు 50శాతం ఉండగా 30-45 వయస్సున్నవారు 35శాతం, 45-60 మధ్య వయసున్న వారు 25శాతం మంది ఉన్నారు. కాకినాడ జిల్లాలో 26మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరిలో 18-30 ఏళ్ల మధ్య వయసున్న వారు 65శాతం, 30-45 మధ్య వయసున్న వారు 25శాతం, 45-60 ఏళ్ల మధ్య వయసున్న వారు 15శాతం మంది ఉన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కేవలం 20మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందులో 18-30 ఏళ్ల మధ్య వయసు గలవారు 70 శాతం, 30-45 ఏళ్ల మధ్య వయసున్న వారు 20 శాతం మంది, 45-60 ఏళ్ల మధ్య వయసున్న వారు 10 శాతం మంది ఉన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి 8మంది మాత్రమే నమోదు చేసుకున్నారు.

జీవన్‌దాన్‌తో..

జీవన్‌దాన్ అనే ప్రభుత్వ వెబ్‌సైట్ దేశంలో అన్ని రాష్ట్రాలకు దేనికదే ప్రత్యేకంగా ఉంటుంది. అలా మన రాష్ట్రంలో ఎవరికైనా అవయవం కావాలంటే.. సంబంధిత ఆస్పత్రి ద్వారా జీవన్‌దాన్.ఏపీ వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకోవాలి. అవయవ మార్పిడి శస్త్రచికిత్స చేసే ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రి తప్పనిసరిగా జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో కూడా రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. అది పూర్తయిన ఆసుపత్రికే అవయవాలు కేటాయించి అక్కడే మార్పిడి నిర్వహిస్తారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 23 ఆసుపత్రులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. వీటిలో కాకినాడ జిల్లాకు చెందిన జీజీహెచ్‌తో పాటు మరో మూడు ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి.





పేరవరానికి చెందిన ముళ్ళపూడి సత్యనారాయణ దంపతులు శరీర దానానికి అంగీకార పత్రం అందచేస్తున్న దృశ్యం (ఫైల్)

పేరవరం... దానగుణం

ఆత్రేయపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థుల పరిశోధన కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరవరం గ్రామానికి చెందిన ఆధ్యాత్మికవేత్త ముళ్లపూడి సత్యనారాయణ-విశాలాక్షి దంపతులు మరణానంతరం తమ శరీరాలను దానం చేశారు. రెండేళ్ల క్రితం రాజానగరం జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో శరీర దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ సమయంలో ముళ్లపూడి దంపతులు వైద్య విజ్ఞానం కోసం అధ్యయనానికి తమ శరీరాలను దానం చేస్తూ అంగీకార పత్రం అందించి సమాజానికి ఆదర్శంగా నిలిచారు.



శరీర దానం చేసిన సత్యనారాయణ-విశాలాక్షి దంపతులు

నేత్ర దానంపై ప్రచారం చేస్తున్నాము

ముళ్లపూడి మోహనరావు, అభ్యుదయ రైతు

మరణానంతరం తమ నేత్రదానం చేయడం వల్ల మరొకరికి కంటిచూపు ప్రసాదించిన వారమవుతాం. మృతుల కళ్ల నుంచి కార్నియాలను మాత్రమే సేకరిస్తారు. అపోహలు విడనాడాలి. మరింత ఎక్కువమంది నేత్రాలను దానం చేయడానికి విస్తృత ప్రచారం చేస్తున్నాము. మా గ్రామస్తులు చైతన్యవంతమై స్ఫూర్తిదాయకంగా నిలవడం గర్వకారణంగా వుంది.

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం

మరణానంతరం నేత్రాలను దానం చేయడం చూపులేని వారికి వెలుగు ప్రసాదించి పునర్జన్మ ఇవ్వడమే. అభ్యుదయ రైతులైన ముళ్లపూడి కుటుంబానికి చెందిన సత్యనారాయణ, మోహనరావులతో పాటు మరికొంత మంది నేత్రదానంపై పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహించారు. పేరవరంలో మరణించిన వారి కార్నియాలను సేకరిస్తున్నారు. రాజవరం, కట్టుంగ, వద్దిపర్రుల్లో కూడా పలువురు మరణానంతరం నేత్రదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాలు



పీడీజే సునీతను సత్కరిస్తున్న నన్నయ వర్సిటీ అధికారులు

దివాన్‌చెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇతరులను ఇబ్బందులకు గురిచేయాలని, బాధపెట్టాలనే మానసిక రుగ్మతే ర్యాగింగ్ అని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత, నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య పి.ప్రసన్నశ్రీ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే నన్నయ విగ్రహానికి పూలమాల వేయడంతో బాటు ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో సునీత మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. విద్యాలయంలో ఆనందకర వాతావరణం ఉండేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సీనియర్ విద్యార్థులు తమ జూనియర్‌లకు ఆదర్శ ప్రాయులుగా ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారికి విధించే శిక్షలు, చట్టాలపై అవగాహన కల్పించారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ వరకూ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. భౌతికంగా, మౌఖికంగా, డిజిటల్‌గా ఏరూపంలోనైనా ర్యాగింగ్‌ను సహించేదిలేదన్నారు. దుష్ప్రవర్తనను అరికట్టడానికి సీసీటీవీ నిఘాతోబాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎవరినీ ర్యాగింగ్ చేయబోమని సభికులతో వీసీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పీడీజేను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డీన్ ఆచార్య ఎన్.ఉదయభాస్కర్, వర్సిటీ లీగల్ అధికారి నాగేంద్రరావు, సీనియర్ అడ్వకేట్ వెంట్రప్రగడ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకం అమల్లో నిర్లక్ష్యం చూపొద్దు

ఆర్టీసీ విజయవాడ జోన్ -2 ఈడీ విజయరత్నం



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఈడీ విజయరత్నం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణం - స్త్రీ శక్తి పథకం అమలులో ఆర్టీసీ యంత్రాంగం నిర్లక్ష్యం చూపరాదని ఆర్టీసీ విజయవాడ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విజయరత్నం అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించి బస్ స్టేషన్, ఎర్నింగ్ సెక్షన్, గ్యారేజీలోని వివిధ విభాగాలను తనిఖీ చేశారు. స్త్రీ శక్తి పథకంపై ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు నిబద్ధతతో పనిచేయాలన్నారు. కండీషన్‌లో ఉన్న బస్సులను మాత్రమే డ్రైవర్లకు గ్యారేజీ సిబ్బంది ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి, రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్, అన్ని విభాగాల సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి



ధవళేశ్వరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం ఉదయం కాటన్ బ్యారేజ్ నుంచి 1.18లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహించగా సాయంత్రానికి అదే స్థాయిలో 1,18,431 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది.వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టా కాల్వకు 4200 క్యూసెక్కులు, మధ్య డెల్టా కాలువకు 2250 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 6500 క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 16.2 అడుగులుగా నమోదయింది.

అక్షర..విజయం!



9వ వార్డులో చేసిన పనులను వివరిస్తున్న ఎమ్మెల్యే వాసు

(ఒకటో పేజీ తరువాయి)

కార్యక్రమమన్నారు. ఆంధ్రజ్యోతి 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా' సభ నిర్వహించగా రోడ్లు, డ్రెయినేజీలు, పార్కులు, కల్వర్టులు, కల్వర్టు స్లాబులు, శానిటేషన్, విద్యుత్, రేషన్ కార్డులు, గృహాలు తదితర అంశాలకు సంబంధించి స్థానిక ప్రజలు పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వాటిపై ఆంధ్రజ్యోతి ఎప్పటికప్పుడు తనతో, అధికారులతో, స్థానిక ప్రముఖులతో సమన్వయం చేసుకుందని తెలిపారు. దీంతో కేవలం 6 నెలల్లో రూ.10 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని, ఇంకా రూ.7 కోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 9వ వార్డును ఎంచుకోవడం ఈ ప్రాంత ప్రజలు అదృష్టంగా భావిస్తున్నారని చెప్పారు. అందరూ ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బర్మా కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకు, కమ్యూనిటీ హాలు కూడా నిర్మిస్తామ న్నారు. 2, 9, 45, 46, 10వ వార్డుల్లో పందుల సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వానికి చెప్పినా పట్టించుకోలేదని, సమస్య పరిష్కారానికి మళ్లీ ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ సారి ఒక్కవార్డు కాకుండా తన నియోజకవర్గం మొత్తం ఇలాంటి కార్యక్రమం చేయాలని కోరుతున్నామన్నారు. నియోజకవర్గంలో 6 వేల కొత్త రేషన్ కా ర్డులు ఇచ్చామని, త్వరలోనే సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రజ్యోతి బ్రాంచి మే నేజరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యాజమాన్యం, ఎండీ రాధాకృష్ణ ఆలోచనలతో ప్రజల స్థానిక సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయడమే లక్ష్యంగా అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా రూపొందించడం జరిగిందన్నారు. దానిలో భాగంగా ఎమ్మెల్యే, అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్లామన్నారు. దీంతో 9వ వార్డులో 6 నెలల్లో రూ.10 కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఈ ప్రాంత రూపు రేఖలు మారిపోవడం ప్రజలు గుర్తించారన్నారు. ప్రజలు ఆంధ్రజ్యోతిని ఓన్ చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ, అధికారులు, స్థానిక ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాజమండ్రి అధ్యక్షుడు డాక్టర్ పి.విజయ భాస్కర్, ఎలక్ట్రికల్ డీఈ శామ్యూల్, మునిసిపల్ కార్పొరేషన్ డీఈ లోవరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు, వెంకటేశ్వర నగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాను ప్రసాద్, 11వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి రాజేంద్ర, యాడ్స్ మేనేజరు కృష్ణారావు, సర్క్యులే షన్ మేనేజరు గోపాలకృష్ణ, సీనియర్ రిపోర్టరు సత్యనారాయణ, స్టాఫ్ రిపోర్టరు రమేశ్ నాగేంద్ర, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాజేశ్వరరావు, ఏబీఎన్ రాజబాబు, కెమెరామెన్ సతీశ్, రిపోర్టర్లు శంకర్, వెంకన్నదొర, శ్రీకాంత్, యాడ్స్ విభాగం రవీంద్ర, సుబ్రహ్మణ్యం, శ్రీరామ్, విజయేంద్ర, కిరణ్, సర్క్యులేషన్ ఏసీవో బాషా, సాయి, మధు, గణేశ్, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

సీసీ రోడ్లు	(రూ.లక్షల్లో)
ఐఎంఏ హాలు రోడ్డు	132.00
హోం కంపర్టు వెనుక వీధిలో	69.50
వాకర్స్ రోడ్ 1	17.00
కాంచననగర్	15.00
విద్యుత్ కాలనీ 6వ వీధి	29.00
వాకర్స్ రోడ్ 3, 1వ క్రాస్ రోడ్	9.50
ఎస్‌బీఐ కాలనీ వీధి	9.90
వెంకటేశ్వరనగర్	32.00
కోకా భాస్కరనగర్	74.50
వెంకటేశ్వరనగర్ 5వ వీధి	15.00
వాకర్స్ రోడ్ 4	20.00
సుక్షేత్ర అపార్ట్‌మెంట్ ఎదురుగా	14.00
తారకరామా నగర్	27.25
తారకరామానగర్	38.00
సీసీ డ్రెయిన్లు	
మహాలక్ష్మీ దేవాలయం రోడ్డులో	5.40
సత్యాగ్రౌండ్ ఎదురుగా	9.15
క్రిసెంట్ రోడ్‌లో	9.25
కాలనీ పార్కులో	61.00
కోకా భాస్కరమ్మ నగర్	39.00
మహాలక్ష్మీ ఆలయం రోడ్డు	36.50
అదే రోడ్డులో క్రాస్ రోడ్డు	32.40
డెఫొడిల్స్ అపార్ట్‌మెంట్ క్రాస్ రోడ్	5.40
జయశ్రీ గార్డెన్స్ 5వ వీధి	9.98
శ్రీనివాసనగర్ 2, 3 వీధులు	9.90
మహాలక్ష్మీ టెంపుల్ రోడ్	5.50
కాంచననగర్	19.00
శ్రీనివాసానగర్ మెయిన్ రోడ్	138.00
ఇతర పనులు	
జయశ్రీ గార్డెన్స్ రోడ్డులో మరమ్మతులు	5.50
వాకర్స్ పార్కులో అభివృద్ధి	9.00
ఏకేసీ కాలేజీ పార్కులో వాకింగ్ ట్రాక్	2.85
మహాలక్ష్మీ టెంపుల్ వీధిలో కల్వర్టు	3.40
విద్యుత్ కాలనీ	65.00
మొత్తం	968.88 లక్షలు

చాలా అభివృద్ధి చెందింది



చాలా వరకు అభివృద్ధి చెందింది. అయినా ఇంకా మా ప్రాంతంలో సమస్యలు ఉన్నాయి. డ్రైనేజీలు బాగా లేవు. చెత్త తీసే వారు చెత్తను తొలగించడం లేదు. దోమలు ఎక్కువగా ఉన్నాయి. ఇళ్ల స్థలాలు రాలేదు.

-వనుం గొల్లవేణి, బర్మాకాలనీ 4వ వీధి.

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడాలి



గతంలో నిర్వహించిన కార్యక్రమంలో సమస్యను చెప్పడం జరిగింది.మా ప్రాంతంలో డ్రైనేజీలకు గ్రావిటీ లేదు.నీటి ప్రవాహం లేదు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడాలి.

-ఏవీ సత్యనారాయణ, వెంకటేశ్వరనగర్.

విద్యుత్ చార్జీలు పెరిగాయి



విద్యుత్ చార్జీలు పెంచారు. గతంలో రూ.600, రూ.700 వచ్చే విద్యుత్ బిల్లులు ప్రస్తుతం రూ.1500, రూ.1800 వస్తుంది. విద్యుత్ అధికారులను అడుగుతుంటే సమాధానం చెప్పడం లేదు.

ఎన్.సత్యనారాయణ,కోటావీధి 9వ వార్డు.

రహదారులు మెరుగుపడ్డాయి



ఆంధ్రజ్యోతి మంచి కార్యక్రమం నిర్వహించింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నిధులు కేటాయించి మా వార్డు అభివృద్ధి పరిచారు. రహదారులు మెరుగుపడ్డాయి. సదుపాయాలు అన్ని సమకూరాయి.

-బి.దేవుడమ్మ, బర్మా కాలనీ.

మా ప్రాంతం అభివృద్ధి చెందింది



జనవరిలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అక్షరం అండగా, పరిష్కారం అజెండాగా అనే నినాదంతో మంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. మా ప్రాంతంలో సమస్యలు గుర్తించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారంతో పాటు మా ప్రాంతం అభివృద్ధి చెందింది. రహదారులు, డ్రైనులు మెరుగుపడ్డాయి.

-మధు చందన, మహాలక్ష్మి గుడి వీధి.

పట్టా ఇచ్చి స్థలం చూపలేదు



గత ప్రభుత్వంలో పట్టా ఇచ్చారు కానీ స్థలం చూపలేదు. ఇప్పటికీ ఆపట్టా అలానే ఉంది. కూటమి ప్రభుత్వంలోనైనా స్థలం చూపించి మాకు న్యాయం చేయాలి.

బి.గీతాసుహాసిని, బర్మాకాలనీ, 9వ వార్డు.



ఐఎంఏ హాల్ రోడ్డు



జార్ఖండ్ జయకేతనం

- కాకినాడలో ముగిసిన జాతీయ హాకీ జూనియర్ మహిళల చాంపియన్‌షిప్
- హోరాహోరీగా ఫైనల్ పోరు
- విన్నర్‌గా జార్ఖండ్, రన్నర్‌గా హర్యానా జట్లు



విజేతగా నిలిచిన జార్ఖండ్ జట్టు సభ్యులు


ట్రోఫీని ముద్దాడుతున్న జార్ఖండ్ క్రీడాకారిణ

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడలో 12రోజులపాటు జరిగిన జాతీయ హాకీ జూనియర్ మహిళల చాంపియన్‌షిప్ ముగిసింది. జార్ఖండ్- హర్యానా జట్ల మధ్య ఫైనల్ పోరు హోరాహోరీగా జరగ్గా జార్ఖండ్ విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీ బహూకరించారు. కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానం వేదికగా ఆస్ట్రో హాకీ ఫీల్డ్‌లో ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఇండియన్ ఆయిల్ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళల జాతీయ చాంపియన్‌షిప్-2025 మంగళవారంతో ముగిసింది. దేశావ్యాప్తంగా 30 జట్లు పాల్గొన్న ఈ హాకీ టోర్నీ ఆది నుంచి హోరాహోరాగా సాగింది. మంగళవారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జార్ఖండ్, హర్యానా జట్లు తలపడ్డాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, జోనల్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి బ్రిగేడియర్ రాకేష్‌శర్మ ఆవాస్తి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మానిషా హాజరై వీక్షించారు. మ్యాచ్‌లో జార్ఖండ్ 2-1 తేడాతో హర్యానాపై విజయం సాధించింది. అంతకుముందు మూడోస్థానం కోసం ఉత్తరప్రదేశ్ వర్సెస్ చత్తీస్‌గఢ్ జట్లు తలపడ్డాయి. 2-0తో ఉత్తరప్రదేశ్ మూడోస్థానంలో నిలిచింది.



తలపడుతున్న జార్ఖండ్- హర్యానా జట్లు

విజేతలకు బహుమతుల ప్రదానం

పోటీల అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. చాంపియన్‌షిప్-2025 టోర్నమెంట్‌లో భాగంగా విజేతగా నిలిచిన జార్ఖండ్, రెండోస్థానంలో నిలిచిన హర్యానా, మూడోస్థానంలో నిలిచిన ఉత్తరప్రదేశ్ జట్లకు మెడల్స్, ట్రోఫీలను ముఖ్యఅతిథులు ప్రదానం చేశారు. హాకీ టోర్నీ ముగింపు వేడుకలను పురస్కరించుకుని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళల జాతీయ చాంపియన్‌షిప్-2025 టోర్నీ కాకినాడలో ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. 2వారాలుగా హాకీ మ్యాచ్‌లు సక్రమంగా జరగడానికి సహకరించిన స్పాన్సర్స్‌కు.. ప్రాముఖ్యం గా క్రీడాకారులకు భోజనం, వసతి, భద్రత, రవా ణా వంటి ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులకు అభినందనలు తెలిపారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, హాకీ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ, కోచ్ వి.రవిరాజును ప్రత్యేకంగా అభినందించారు. జార్ఖండ్ జట్టు సభ్యులందరికీ కాకినాడ జిల్లా ప్రత్యేకతను తెలిపి చేనేత కార్మికులు, చేనేత వస్త్రాలను ప్రోత్సహించే ఉద్దేశంతో పెద్దాపురం సిల్క్ శారీలను బహుమతులుగా అందజేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి ఉత్సాహంగా టోర్నమెంట్‌లో పాల్గొని ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించారన్నారు. ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సాధారణమని, పోరాట స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమన్నారు. జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరారు. కార్యక్రమంలో పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీసీఎం జుబ్బు గార్గ్, కేఎస్పీఎల్ సీఈవో మురళీధర్, కోరమండల్ కాకినాడ యూనిట్ హెడ్ కె.జగన్నాథం, ఏఎం గ్రీన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏఎస్ నాయుడు, అరబిందో జీఎం సీఎస్ఆర్ డి.సుధాకర్ హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఎం.నిరంజన్‌రెడ్డి, అధ్యక్షుడు బి.చాణిక్యరాజు పాల్గొన్నారు.



హర్యానా జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు


మాట్లాడుతున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

మహానుభావుడు ఎన్టీఆర్

రామచంద్రపురంలో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన సినీ నటుడు నారా రోహిత్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల సంక్షేమ పథకాలకు ఆద్యుడు దివంగత ఎన్టీఆర్ అని సినీ నటుడు నారా రోహిత్ అన్నారు. మం గళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం- పసలపూడి బైపాస్ జంక్షన్‌లో సత్యంవాసంశెట్టి ఫౌండేషన్ రూ.9 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని నారా రోహిత్ ఆవిష్కరించారు. గజమాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిపాలనలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అన్నారు. తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టమన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్రంలో కూటమి పాలన కొనసాగుతుందని, ఆయన ఆశయాలను అమలు చేస్తూ సీఎం చంద్రబాబు మంచి పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సేవలు చిరకాలం నిలిచిపోతాయన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి సుభాష్, ఎమ్మెల్యే జోగేశ్వరరావు నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలు నారా రోహిత్, మంత్రి సుభాష్ శిల్పి వడయార్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్ రాయ్, గంధం పళ్లంరాజు, వాసంశెట్టి సత్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నారా రోహిత్, పాల్గొన్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల

సుందరకాండ ట్రైలర్ విడుదల

నారా రోహిత్ నటించిన సుందరకాండ సినిమా ట్రైలర్‌ను మంత్రి సుభాష్ మంగళవారం విడుదల చేశారు. రామచంద్రపురం మండలం చోడవరం విజయఫంక్షన్‌హాలులో విడుదల చేసిన మంత్రి మాట్లాడుతూ ట్రైలర్ చాలా బాగుందని, ఈనెల 27న వినాయక చవితి సందర్భంగా చిత్రం విడుదల కానుందని తెలిపారు. నారా రోహిత్ సినిమా లోని డైలాగ్స్ చెప్పడంతో యువకులు కేరింతలు కొట్టారు.


సుందరకాండ ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నారా రోహిత్, మంత్రి సుభాష్

కాకినాడ నచ్చేసింది...

సినీ నటి నిధి అగర్వాల్ సందడి



మాట్లాడుతున్న నిధి అగర్వాల్

కాకినాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో సినీ నటి నిధి అగర్వాల్ సందడి చేశారు. కాకినాడ దేవాలయంవీధిలోని ఓ జ్యూవెలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి మంగళవారం ఆమె విచ్చేశారు. ప్రేక్షకులు ఆమెను చూసేందుకు భారీగా తరలివచ్చారు. షోరూమ్‌ను రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. షోరూమ్‌లోని ఆభరణాలను పరిశీలించి, ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడ మొదటిసారి వచ్చానని, కాకినాడ తనకు బాగా నచ్చిందన్నారు. తన తర్వాత చిత్రం రాజాసాబ్ అని తెలిపారు.

ఎన్నాళ్లకో...

- ఉమ్మడి జిల్లాలో ఉన్నట్టుండి ఒక్కసారిగా భారీగా దంచికొట్టిన వాన
- రాష్ట్రంలోనే కోటనందూరు, సామర్లకోటలో అత్యధిక వర్షపాతం నమోదు
- రాబోయే రెండు రోజులు భారీ వర్షాల హెచ్చరిక


సామర్లకోటలో రహదారిపై వర్షం నీరు


కిర్లంపూడిలో జోరుగా కురుస్తున్న వర్షం


తునిలో వర్షం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం వర్షాలు దంచికొట్టాయి. ఉన్నట్టుండి ఆకాశం బద్ధలైందా అన్నట్లు కుండపోతకు మించిన వానలు కురిశాయి. అప్పటివరకు తీవ్ర వేడితో అల్లాడిన జనాలకు ఉపశమనం కలిగించాయి. సరిగ్గా మధ్యాహ్నం మూడున్నర దాటిన తర్వాత జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అరగంట వ్యవధిలో ఏకంగా ఏడు సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసింది. దీంతో స్వల్ప వ్యవధిలో కురిసిన భారీ వానకు ఎక్కడికక్కడ రహదారులు, లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కురిసిన భారీవర్షంతో రహదారులు ఏరులయ్యాయి. ముఖ్యంగా అతి తక్కువ వ్యవధిలో కురిసిన భారీ వర్షంతో కాకినాడ జిల్లా కోటనందూరు, సామర్లకోటలో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కోటనందూరులో అతి స్వల్ప సమయంలో ఏకంగా 7.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సామ ర్లకోటలోను అదేస్థాయిలో 7.2సెం.మీ. వర్షపాతం నమోదైంది. జగ్గంపేటలో 5సెం.మీ., గొల్లప్రోలు మండలం చేబ్రోలులో 4.8, కిర్లంపూడి 4.5, పెద్దాపురం 4.2, యు.కొత్తపల్లి 4, అల్లూరి జిల్లాలోని రాజవొమ్మంగి మండలంలో 3.9, రౌతులపూడి 3.7, కరప 3.6, పెదపూడి 3.5, కాకినాడ అర్బన్ 2.6, పిఠాపురం 2.4, తాళ్లరేవు 2.2, తుని 1.5చొప్పున నమోదైంది. కోనసీమ జిల్లా ఉప్పలగుప్తంలో 1.4, ముమ్మిడివరం 8.5, ఐ.పోలవరం, అమలాపురం 3.5, అంబాజీపేట, రామచంద్రపురం, అల్లవరం, రాజోలు, మామిడికుదురులో 1.25 మి.మి., తూ.గో.జిల్లా రంగంపేటలో 4.24మి.మి చొప్పున వర్షపాతం నమోదైంది. కాగా బంగాళా ఖాతం మధ్య ప్రాంతాల్లో సముద్రమట్టానికి సగటున 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో బుధవారం పశ్చిమ మధ్య, దాన్ని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడనున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. దీంతో రాబోయే రెండు రోజులు పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. గంటకు 40నుంచి 50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, మత్స్యకారులు శనివారం వరకు వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది.

మాయమాటలు చెప్పి బాలికపై అత్యాచారం

కేసు నమోదు

పరారీలో నిందితుడు

అనపర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం ఓ గ్రామంలోని కోళ్ల ఫారంలో పనిచేస్తున్న పదహారేళ్ల బాలికకు డ్రైవర్‌గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ మాయ మాటలు చెప్పి ఈ నెల 9న రాత్రి ఇంటి నుంచి తీసుకెళ్లాడు. మరుసటి రోజు బాలిక తల్లిదండ్రులు కుమార్తె అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలికను దుర్గాప్రసాద్ మండపేట, భీమవరం, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో తిప్పుతూ పలు మార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. చివరకు అతడి చెర నుంచి బాలికను పోలీసులు విడిపించగా నిందితుడు పరారయ్యాడు. అదృశ్యం కేసును కిడ్నాప్, అత్యాచారం కేసుగా మార్పు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని, బాలికను వైద్య పరీక్షలకు తరలించనున్నట్టు తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

కాట్రేనికోన, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అత్యాచారయత్నం కేసులో నిందితుడికి కోర్టు 15 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చెయ్యేరు బ్రాహ్మణచెరువులో తన పిల్లలతో కలిసి నిద్రిస్తున్న మహిళపై దార్ల అన్నవరం అలియాస్ చినవీరవెంకటసత్యానారాయణ 2 రోజుల క్రితం అత్యాచారయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి ముమ్మిడివరం కోర్టులో హాజరుపరచగా కోర్టు 15 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు.

మైనార్టీ వారసత్వ ప్రదేశాల పరిరక్షణకు కేంద్రం చర్యలు

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దేశంలో మైనార్టీ వారసత్వ ప్రదేశాలు, ప్రార్థనా మందిరాలతోపాటు తీర్థయాత్ర కేంద్రాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర సంస్కృతి, పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. వీటి పరిరక్షణకు రాష్ట్రాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారన్నారు. దేశంలో ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలో 3,685 కేంద్రీయ పరిరక్షిత స్మారక చిహ్నాలు ఉన్నాయని, వీటిలో మైనార్టీ వారసత్వ ప్రదేశాలు కూడా ఉన్నాయని వెల్లడించారు. ఏపీలో 2020-21 సంవత్సరంలో రూ.4.57కోట్లు నిధులు కేటాయించగా, 2024-25లో రూ.6.50కోట్లు నిధులు ఇచ్చామని మంత్రి తెలిపారని ఎంపీ పేర్కొన్నారు.


కత్తిపూడిలో పొలాన్ని పరిశీలిస్తున్న రైతులు

3.7 ఎకరాలు.. పది పంటలు

సాగులో వైవిధ్యం చూపిస్తోన్న కత్తిపూడి వాసి

పరిశీలించేందుకు ఉమ్మడి జిల్లా నుంచి 40 మంది రైతులు రాక

శంఖవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన గాబు బాబ్జీ ప్రకృతి వ్యవసాయంలో అనుసరిస్తున్న తీరు రైతులను అబ్బురపరుస్తుంది. 3.7 ఎకరాల్లో పది పంటలు పండిస్తూ ప్రకృతి వ్యవసాయంలో వైవిధ్యం ప్రదర్శిస్తున్నారు. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, తీగజాతి, దుంపజాతి, దేశీ ఉల్లి, పసుపు, ఉల్లి, మునగ, మారేడు, ఉసిరి, గోరింట వంటి రకాలను ఐదు లేయర్ల మోడళ్లను అనుసరిస్తూ పండిస్తున్నారు. దీనిపై మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 40మంది రైతులు ప్రకృతి వ్యవసాయంపై రైతు బాబ్జీ వ్యవహరిస్తున్న పద్ధతులను తెలుసుకునేందుకు శిక్షణకు వచ్చారు. వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో దశపర్ణికాషాయం, అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, చిల్లి స్పెషల్ కషాయాలు వంటివి తయారు చేసి వాటి విశేషాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కాకినాడ డీపీఎం ఏలియాజార్, పాటి సింహాద్రి, గుండ్ర శివచక్రం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పొల్యూషన్ కా సొల్యూషన్..

తెలంగాణ యువకుడు సైకిల్ యాత్ర


సైకిల్ యాత్ర చేస్తున్న మహేష్‌గౌడ్

అంతర్వేది, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పొల్యూషన్ కా సొల్యూషన్ పేరుతో నీరు, చెట్లను కాపాడాలనే నినాదంతో తెలంగాణకు చెందిన యువకుడు మహేష్‌గౌడ్ చేపట్టిన యాత్ర కోనసీమ జిల్లాలో మంగళవారం సాగింది. దిండి గ్రామం నుంచి వశిష్ట గోదావరి వారధి మీదుగా చించినాడవైపు వెళుతున్న అతడిని ఆంధ్రజ్యోతి పలకరించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 అక్టోబరు 17న మహబూబ్‌నగర్ జిల్లాలో బోయపల్లి గ్రామం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించాన ని తెలిపాడు. రోజువారీ కూలీ అయిన తాను పొల్యూషన్‌పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో యాత్రను చేపట్టానని తెలిపాడు. తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, నేపాల్, పశ్చిమబెంగాల్, ఒడిసా రాష్ట్రాల మీదుగా ఏపీలో కొనసాగుతుందని.. తమిళనాడు, కేరళ మీదుగా గోవా వెళతానని మహేష్‌గౌడ్ పేర్కొన్నాడు.

పాడి గేదెలు దొంగిలించిన నలుగురి అరెస్ట్


దొంగలను అరెస్ట్ చేసిన గండేపల్లి పోలీసులు

గండేపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో నాలుగు పాడి గేదెల దొంగతనానికి పాల్పడిన నలుగురిని అరెస్ట్ చేసినట్టు గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబు తెలిపారు. అశ్వరావుపేటకు చెందిన ఈ.చరణ్, ఎన్ఎన్ తిరుపతి, వి.ఆర్‌కుమార్, బి.వీరేంద్రను అరెస్ట్ చేసి పాడి గేదెలు, బడా దోస్త్ వాహనం, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

'పట్టు పరిశ్రమకు మల్బరీ సాగు కీలకం'

ప్రత్తిపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమకు మల్బరీ సాగు అత్యంత కీలకమని, మల్బరీ ఆకుల నాణ్యత, దిగుబడి పట్టు ఉత్పత్తిని ప్రభావితం చేస్తాయని పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఇ భువనేశ్వరి చెప్పారు. మేరా రేషన్ మేరా అభియాన్‌లో భాగంగా చేబ్రోలు రీసెర్చ్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ సైంటిస్ట్ అయిన భువనేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం మల్బరీ తోటలను అధికారులు పరిశీలించారు. విశ్రాంత పట్టుపరిశ్రమాధికారి ఐ.కోటిలింగేశ్వరరావు, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి జి.రామారావు, పట్టు పరిశ్రమ సాంకేతిక అధికారి డీవీ రమణ ఉన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) మనస్తాపంతో ఓ మహిళ మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అపస్మారకస్థితిలో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతుంది. బాధితురాలి భర్త తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ బాలాజీ చెరువు కూడలిలోని టీటీడీ కల్యాణ మండపంలో కుశ్వంత్ వాచ్‌మెన్‌గా పని చేస్తుండగా, అతడి భార్య అరుణ స్వీపర్‌గా పని చేస్తూ ఆ ప్రాంగణంలో వెనుక ఉన్న గదిలో నివసిస్తున్నారు. అయితే కల్యాణ మండపం మేనేజర్ ఎన్ఎస్ఎన్ రాజు తరచూ తమను దూషిస్తూ మానసికంగా వేధించాడని కుశ్వంత్ పేర్కొన్నారు. బుధవారం జరిగే వివాహం సందర్భంగా వచ్చిన ఓ పార్టీ తన ప్రమేయం లేకుండా అక్కడ పనులు చక్కబెడుతున్నారనే అసూయతో మేనేజర్ రాజు తనపై దుర్భాషలాడి వెళ్లిపొమ్మని చెప్పాడని తెలిపాడు. తన భార్య అరుణను తీవ్ర పదజాలంతో దూషించాడని, దీంతో అరుణ ఎలుకల మందు, చీమల మందు బాదం మీల్‌లో కలిపి తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిందని కుశ్వంత్ పేర్కొన్నాడు. తీవ్ర అస్వస్థతకు గురై న అరుణను జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు జీజీహెచ్ అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న అరుణ

తునిలో...



నీలి ఆకాశం.. ఉల్లాసం

కాకినాడ జిల్లా తుని, ప్రత్తిపాడులో కారు మబ్బులు ఇలా అందంగా కమ్ముకున్నాయి. నీలి మేఘాలు కనువిందు చేశాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది.


ప్రత్తిపాడులో...

తోట ఆర్థిక సహాయం

యానాం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్త తోట రాజు బీరుబాటిల్ దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న విద్యాసాగర్‌ను పరామర్శించారు. కాకినాడలో చికిత్స పొందుతున్న కమిశెట్టివారివీధికి చెందిన షేక్ బాషావలి కుటుంబానికి రూ.25 వేలు అందించారు. వినాయకుడు, అయ్యప్ప స్వామి ఆలయాలకు రూ.2లక్షలు అందించారు.

విద్యార్థికి కలెక్టర్ అభినందన



అంబాజీపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శనతో అవార్డు పొందిన తొండవరం హైస్కూల్ విద్యార్థి సోము ఈశ్వరశ్రీరామ్‌తేజ, ఉపాధ్యాయుడు కందాల గణేష్ నరసింహంలను అమలాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్ అభినందించారు.

తహశీల్దారు కార్యాలయం పరిశీలన

అంబాజీపేట, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డు సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన తహశీల్దారు కార్యాలయ భవనాన్ని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈఈ పి.రామకృష్ణ, డీఈఈలు చంద్రశేఖర్, ఎ.రాంబాబులు పరిశీలించి భవన స్థితిగతులు, ఎంతమేరు నిధులు అవసరమో అంచనాలు రూపొందించారు. కలెక్టర్‌కు నివేదికందిస్తామని ఈఈ తెలిపారు.

వ్యవసాయానికి ఉపాధిహామీని అనుసంధానించాలి

• రూ.12.79కోట్ల ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

అమలాపురంరూరల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనుల సీజన్‌లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానంచేసి రైతులకు మేలు చేకూర్చాలని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర ప్రతినిధి ఉప్పుగంటి భాస్కరరావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ పనుల సీజన్‌లో కూలీలు దొరకక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిని ఆశ్రయించి అధిక మొత్తంలో వేతనాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పర్యవేక్షణలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఏడాదికాలంలో మండల పరిధిలోని 22గ్రామాల్లో రూ.12,79,31,230నిధులతో చేపట్టిన 1040పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. గ్రామాల వారీగా డీఆర్పీలు సేకరించిన వివరాలను ఎస్ఆర్పీ పి.సింహాద్రిసభలో వివరించారు. 2024-25లో ఉపాధిహామీ పథకంలో 940పనులు చేపట్టగా కూలీలకు రూ.6,78,28,103 వేతనాలను చెల్లించగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.31.40లక్షలు పనులు చేపట్టారన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో 97పనులు చేపట్టగా కూలీలకు రూ.65,315 వేతనాలు కింద, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.5,66,32,519 పనులు చేశారు. ఇక పారెస్టు విభాగంలో మూడు పనులకు కూలీలకు వేతనాలు కింద రూ.84,785 చెల్లించగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.1,80,252 చెల్లించినట్టు వివరించారు. ఆయా పనులపై గ్రామాల వారీగా డీఆర్పీలు ఎన్.మనోజ్, జి.జగదీష్, సీహెచ్ ఆదినారాయణ, జి.పద్మావతి, కె.రామకృష్ణ, కె.చిట్టిబాబు, పి.రాజు, ఎం.రాజు, కె.సీమరాజు సేకరించిన వివరాలను సామాజిక సభలో నివేదిక రూపంలో అందజేశారు. ఆయా పనులకు సంబంధించి ఉపాధిహామీలో జరిగినలోటుపాట్లలో భాగంగా రూ.11840, పంచాయతీరాజ్ నుంచి రూ.3400రికవరీ చేయాలని డ్వామా పీడీ మధుసూదన్ తెలిపారు. సామాజికతనిఖీలో స్టేట్ రిసోర్సుపర్సన్ వై.గౌరీశంకర్, అంబుడ్స్‌మెన్ ఎ.వెంకటకృష్ణ, జిల్లా విజిలెన్సు ఆఫీసర్ కె.సత్యనారాయణ, ఏపీవో విప్పర్తి శ్రీనుబాబుపాల్గొన్నారు.



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

లక్ష్యానికి మించి ఉపాధిహామీ పనులు :

జిల్లాలో లక్ష్యానికి మించి ఉపాధిహామీ పనులు చేపట్టినట్టు డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 1.53లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ఉపాధిహామీ కింద 30లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు 44లక్షల పనిదినాలు కల్పించామన్నారు. దీంతో కూలీలకు వేతనాలు చెల్లించడంలో జాప్యం జరిగిందన్నారు. ఈఏడాది మే21 నుంచి కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. పెరిగిన పనిదినాలకు బడ్జెట్ అంచనాలు రూపొందించి అప్రూవల్‌కు పంపించామన్నారు. జిల్లావ్యాప్తంగా రూ.70కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, కేంద్రం బడ్జెట్ విడుదల చేసిన వెంటనే వేతనాలు చెల్లిస్తామన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి



మాట్లాడుతున్న అముడా చైర్మన్ స్వామినాయుడు చిత్రంలో జేసీ నిషాంతి

అమలాపురం టౌన్,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీరించుకునే విధంగా ఆయా యజమానులను ప్రోత్సహించాలని అమలాపురం అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంవల్ల అనధికార లేఅవుట్లలో జీవిస్తున్న వారికిఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. అమలాపురం విత్తనాలవారి కాల్వగట్టులోని వాసర్ల గార్డెన్స్‌లో మంగళవారం అముడా చైర్మన్ స్వామినాయుడు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అముడా వైస్‌చైర్మన్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ జిల్లాలో అధికశాతం అనధికార లేఅవుట్లు ఉన్నాయని, అందుకు పంచాయతీ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వహించకపోవడమే కారణమన్నారు. 2020లో ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ స్కీమును పొడిగించడం జరిగిందన్నారు. విధివిధానాలను ప్లానింగ్ ఆఫీసర్ ఎ.సత్యంమూర్తి కార్యదర్శులకు వివరించారు. సదస్సులో జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ పి.ఉమామహేశ్వరరావు, 180 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం



ఐక్యత చాటుతున్న ఎమ్మెల్యే, కూటమి నేతలు

అంబాజీపేట, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా కూటమి ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో లబ్ధిపొందిన రైతులు హర్షం వ్యక్తం చేస్తూ రైతు సంబర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పి.గన్నవరం పార్టీ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే, కూటమి నేతలు ట్రాక్టర్లు, రెండెడ్ల బండిపై సభ ప్రాంగణం వద్దకు తరలివచ్చారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 23,727మంది రైతులకు రూ.16.31కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. స్థానిక సెంటర్ నుంచి భారీ ర్యాలీగా తరలివచ్చారు. సివిల్ కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్, నియోజకవర్గ పరిశీలకులు షేక్ సుభాన్, జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీరవెంకట సత్యనారాయణ, ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, నాయకుల అరిగెల సూరిబాబు, మైపాల తాతాజీ, గుడాల పణి, దొమ్మేటి సాయికృష్ణ, మొల్లేటి సత్తిబాబు, చిన్నం విజయరావు, జాలెం శ్రీనివాసరాజా, శేరు శ్రీను, ఏఎంసీ కార్యదర్శిఐ.రవికుమార్‌లుపాల్గొన్నారు.

ఫ్లెక్సీ రగడ: ఈకార్యక్రమం సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్ననాయుడు ఫొటోలు లేకపోవడంతో కూటమి నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. ఈఫ్లెక్సీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి డిజైన్ చేసి వచ్చిందని, ఇక్కడ నేతల ఫొటోలు ముద్రించి ఏర్పాటు చేయాల్సి ఉందని టీడీపీ నియోజకరవ్గ పరిశీలకులు షేక్ సుభాన్ తెలిపారు.

ట్రాక్టర్లతో ర్యాలీ

పి.గన్నవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం సెంటర్ నుంచి అంబాజీపేట మార్కెట్ కమిటీవరకు వందట్రాక్టర్లతో ఏర్పాటుచేసిన కృతజ్ఞతా ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించి అనంతరం మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, షేక్ సుభాన్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, మోల్లెటి శ్రీను, జాలెం శ్రీని వాసరాజా, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, ఆరుమిల్లి లాల్‌బాబు, బొండాడ నాగమణి, కె.సత్యనారాయణరాజు, తోలేటి చినబాబు, శేరు శ్రీనుబాబు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, **ఆరుమిల్లి రాంబాబు,** పాల్గొన్నారు.

యూఏఈలో ఉద్యోగావకాశాలు

ముమ్మిడివరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఓవర్సీస్ మేన్‌పవర్ కంపెనీ ఆధ్వర్యంలో యూఏఈలో ఉద్యోగావకాశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు పేర్కొన్నారు. ఏపీకి చెందిన ప్రావీణ్యంతో కూడిన ఫ్యాబ్రికేటర్, ఫిట్టర్, గోగర్, ఇన్నర్‌ఫీల్డ్ వెల్డర్, స్టిక్ వెల్డర్లకు యూఏఈలో ఉద్యోగావకాశాలు కల్పించే అంతర్జాతీయ నియామక కార్యక్రమాన్ని ప్రకటించాయన్నారు. 25నుంచి 45ఏళ్లలోపు పురుషులు ఏదైనా ఎడ్యుకేషన్ కలిగి ఆయా జాబ్ కోర్సుల్లో ఐదేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు యూఏఈలో రెండేళ్ల ఉద్యోగ ఒప్పందం కల్పిస్తారన్నారు. భోజనం, రవాణా, వైద్య సదుపాయాలు, వసతి వంటి సౌకర్యాలు నియామకదారులు అందిస్తారన్నారు. అభ్యర్థులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టు, రిలవెంట్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్, పని అనుభవం సర్టిఫికెట్లను సమర్పించాలన్నారు. వీసా, విమానఖర్చులు కలుపుకుని రూ.35,400 నియమాక రుసుం అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9988853335, 9704414258ని సంప్రదించాలన్నారు.

అనంతకుమారికి గుబ్బల శుభాకాంక్షలు



రాజోలు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రెడ్డి అనంతకుమారిని కొత్తపేటలో ఆమె స్వగృహంలో మంగళవారం గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ లీగల్‌సెల్ కన్వీనర్ బోళ్ల రాంబాబు, కడలి మోహన్ పాల్గొన్నారు.

నూతన పాలకవర్గాలు రైతులకు సేవలందించండి



సొసైటీ నూతన కార్యవర్గాల అభినందన సభలో మాట్లాడుతున్న రాజోలు ఎమ్మెల్యే దేవ

మలికిపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో 25వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నూతన పాలకవర్గాలను శాస్త్రీయ బద్ధంగా ప్రజాస్వామ్యయుతంగా ఎంపిక చేసినట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం నూతన పాలకవర్గ సభ్యులకు ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ సొసైటీలకు ఎన్నికైన మీరు రైతాంగ సేవలో ముందుండాలన్నారు. అర్హత ఉన్న అందరికీ రుణాలు, సభ్యత్వాలు ఇవ్వాలని సూచించారు. నూతన సొసైటీ కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించగా సొసైటీ అధ్యక్షులు ఎమ్మెల్యేను దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేమా, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, పెదకాపు, ఎంపీపీ ఎంపీ సత్యవాణి, ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, మాలే శ్రీనివాసనగేష్, మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, గుబ్బల ఫణి, పినిశెట్టి బుజ్జి, దొడ్డా జయరామ్, యింటిపల్లి ఆనందరాజుపాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలను తక్షణం పరిష్కరించాలి



అమలాపురం ఆర్టీసీ డిపో వద్ద ధర్నాలో మాట్లాడుతున్న కార్యదర్శి మణిరాజు

అమలాపురం రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల, ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను తక్షణం పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం ఆర్టీసీ డిపో వద్ద ధర్నాలో నాయకులు డిమాండ్ చేశారు. తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వేతన సవరణ పూర్తయి రెండేళ్లు అయినందున తక్షణం ఐఆర్ ప్రకటించాలని, యూనియన్ డిపో కార్యదర్శి పితాని మణిరాజు డిమాండ్ చేశారు. ఆర్టీసీకి చెందిన విజయవాడ గవర్నర్ పేటలోని 4.15 ఎకరాల భూమిని లూలూ మాల్‌కు ప్రభుత్వం ఇస్తూ తెచ్చిన జీవోను తక్షణం ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులు కల్పించాలని నినదించారు. ధర్నా శిబిరాన్ని యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి సందర్శించి సంఘీభావం తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రకటించినందున కొత్తగా బస్సులు కొనుగోలు చేయాలని, అదనంగా డ్రైవర్, కండక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ సంస్థ ద్వారానే నిర్వహించాలన్నారు. అధికసంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'30రోజుల్లో ఎమ్మెల్యే కాలేదా'

పి.గన్నవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అదృష్టం కలిసొచ్చి ప్రభుత్వం ఉద్యోగం చేసే మీరు 30రోజుల్లో ఎమ్మెల్యే కాలేదా అని వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఫోన్ చేసి వార్నింగ్ ఇవ్వడంపై శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

నేటి నుంచి ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో అడ్మిషన్లకు సంబంధించి మంగళవారం నోటిఫికేషన్ విడుదలైనట్టు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మి తెలిపారు. ఈనెల21వ తేదీలోగా అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25శాతం సీట్లను కేటాయించాల్సి ఉందన్నారు. అడ్మిషన్ల కోసం సచివాలయాలు, మీ సేవా ఇంటర్నెట్ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఎస్ఈ.ఏపీజీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈనెల25న ఎంపికైన విద్యార్థుల వివరాలు వెల్లడిస్తారన్నారు. ఈనెల31 నుంచి ఎంపికైన విద్యార్థులకు ప్రవేశాలు ఉంటాయన్నారు. హెల్ప్‌లైన్ కోసం 1800-4258599లో ఉదయం 9 నుంచి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారు మాత్రమే దరఖాస్తులకు అర్హులన్నారు.

ఎస్పీగా చింతా బాధ్యతల స్వీకరణ



యానాం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): యానాం ఎస్పీగా యానానికి చెందిన ఐపీఎస్ అధికారి చింతా కొదండరామ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరి పీఏపీ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను సీఐ, పలువురు ఎస్ఐలు, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. పరిపాలనాధికారి మునిస్వామి ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఒకరినొకరు శాలువాలతోసత్కరించుకున్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

అమలాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం, లైంగిక వ్యాధులపై అవగాహన పెంచుకుందాం.. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటెన్సిఫైడ్, ఐఈసీ క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కోనసీమ జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భరతలక్ష్మి మాట్లాడుతూ ఆగస్టు 12నుంచి అక్టోబరు 12వరకు జిల్లాలో 160గ్రామాలు, పట్టణాల్లో ఉన్న హైరిస్క్ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు హెచ్ఐవీ, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కన్సల్టెంట్ డాక్టర్ సౌమ్య, డాక్టర్ సాయిరామ్, బీఎస్ఆర్పీ కౌన్సిలర్ కవిత, ఏఆర్టీ డాక్టర్ సుమిత్ర, జనకల్యాణ్ మేనేజర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలో ముగ్గురికి అవకాశం

అల్లవరం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి):అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీలో డైరెక్టర్లగా మండలానికి చెందిన ముగ్గురికి అవకాశం దక్కింది. కోడూరుపాడుకు చెందిన జనసేన నాయకుడు పిల్లా ప్రసాద్, సామంతకుర్రుకు చెందిన కాకిలేటి సత్యవతి(టీడీపీ), ఓడలరేవుకు చెందిన రేకాడి సత్యనారాయణవర్మ (బీజేపీ)లను నియమించారు.

ముంపు ప్రాంతం పరిశీలన

అమలాపురంటౌన్,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): స్థానిక 28, 29వార్డులకు సంబంధించి సావరం రోడ్డులో కొద్దిపాటి వర్షానికే రోడ్డు ముంపు బారిన పడుతున్న పరిస్థితులను మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కు స్థానికులు వివరించారు. మంగళవారం ముంపు బారిన పడే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, కానూరి అరవింద్‌తో పాటు స్థానికులు ఉన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలి

అమలాపురం టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మహిళా వాకర్స్ క్లబ్ ఏర్పడి 25ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని వాకర్స్ అంతర్జాతీయ సంస్థ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మహిళా వాకర్స్ క్లబ్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. నడక ఉద్యమాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. యర్రమిల్లి అనంతలక్ష్మి అధ్యక్షతన గోఖలేవీధిలో జరిగిన సమావేశంలో మహిళాక్లబ్ నిర్వహణ తీరుపై గవర్నర్ నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. జిల్లా కార్యదర్శి పి.గోపాలకృష్ణ, జోనల్ చైర్‌పర్సన్ దువ్వూరి సుబ్బలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, శిష్టా లక్ష్మీదేవి, పేరి లలిత-లక్ష్మీనరసింహం, బులెటిన్ ఎటిడర్ పుత్సా కృష్ణకామేశ్వర్, గోటేటి గంగాధరరావు, శిష్టా శ్రీహరి, పట్నాల రమణ పాల్గొన్నారు. గవర్నర్ నాగేశ్వరరావును క్లబ్‌తరపున దుశ్శాలువాతో సత్కరించారు.

పంచాయతీ కాంట్రాక్టు సిబ్బంది జిల్లా కార్యవర్గం ఎన్నిక

అమలాపురం రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎ.వేమవరప్పాడు రైతు భరోసా కేంద్రం వద్ద కోనసీమ జిల్లా గ్రామ పంచాయతీ కాంట్రాక్టు సిబ్బంది యూనియన్ సమావేశం నల్లా వెంకటసతీష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కాంట్రాక్టు సిబ్బంది సమస్యలపై తొలుత చర్చించారు. ప్రభుత్వం దశాబ్దాల కాలంగా పంచాయతీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ తీర్మానించారు. అనంతరం జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడిగా రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, అధ్యక్షుడిగా గుంట్రు సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా మోరం వెంకయ్యనాయుడు, కోశాధికారిగా బొంతు శ్రీఫణి, కార్యదర్శిగా పెద్దిరాజు వేమలరావు, కార్యవర్గ సభ్యులుగా దాసరి రాజు, గుత్తుల భైరవస్వామి, మామిడిశెట్టి శ్రీను, పితాని రాంబాబు, దండుమేను శ్రీను, గంటా రామకృష్ణలనుఎన్నుకున్నారు. అదేవిధంగా అమలాపురం డివిజన్‌శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అక్కిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా యడ్ల రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా కోలా నాగప్రసాద్, సభ్యులుగా కుసుమే శ్రీనివాస్, గుబ్బల వెంకటనారాయణ, కుంచే రాముడులను ఎన్నుకున్నారు. తొలుత ఎ.వేమవరప్పాడు పంచాయతీ కాంట్రాక్టు కార్మికుడు గెడ్డం మురళీబాబు ఆకస్మిక మృతికి చింతిస్తూ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

అంతర్వేది పీఏసీఎస్ అధ్యక్షుడిగా నాగు

అంతర్వేది, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో పీఏసీఎస్ అధ్యక్షులుగా నియామకాలు జరిగాయి. అంతర్వేది పీఏసీఎస్ అధ్యక్షుడిగా రావూరి నాగు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నారు. పొన్నమండ కనకరావు, చెల్లుబోయిన వెంకటరమణలు సభ్యులుగా నియమితులయ్యారు. అప్పనరామునిలంక చైర్‌పర్సన్‌గా రావూరి సత్యనారాయణ, సభ్యులుగా కొల్లు వెంకటేశ్వర్లు, యింటిపల్లి సుభాష్‌చంద్రబోస్, శ్రీరామేశ్వరం చైర్‌పర్సన్‌గా చెల్లింగి లీలామోహన్‌శ్రీనివాస్, సభ్యులుగా పెద్దిరెడ్డి దుర్గాప్రసాద్, మంతెన సీతారామరాజు, గుడిమూల చైర్‌పర్సన్‌గా రుద్రరాజు పద్మరామలింగరాజు, సభ్యులుగా ఆడబాల విక్రమ్, గుబ్బల నాగరాజు, మోరి చైర్‌పర్సన్‌గా బళ్ల వెంకటమహాలక్ష్మి రామారావు, సభ్యులుగా మండ రాధాకృష్ణ, కడలి రాంబాబు, సఖినేటిపల్లి చైర్‌పర్సన్‌గా గునిశెట్టి వీరబాబు, సభ్యులుగా పడాల రామారావు, వెలిగట్ల మల్లేశ్వరరావు, వీవీమెరక చైర్‌పర్సన్‌గా వీరవెంకటరామారావు, సభ్యులుగా చెంపాటి సుజాత, బర్రే చంద్రరావు నియమితులయ్యారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు శాన్వి ఎంపిక



అమలాపురం రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థిని బి.శాన్వి జిల్లా స్థాయిలో అండర్-17 బాలికల చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కోచ్ వి.శ్రీనుబాబు, కె.రాజు పర్యవేక్షణలో శాన్వి శిక్షణ పొందింది. ఈనెల16,17 తేదీల్లో కాకినాడలో జరిగే అండర్-17 రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో జిల్లా తరఫున శాన్వి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఏడేళ్ల శాన్వి అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల స్కూలు చైర్మన్ నంద్యాల నాయుడు, డైరెక్టర్ నంద్యాల మనువిహార్ తదితరులు శాన్విని అభినందించారు.

అథ్లెటిక్స్‌లో పార్థు ప్రతిభ



ముమ్మిడివరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల9వ తేదీన జరిగిన 6వ రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో కొత్తలంక జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థి పార్థు సంజీవ్‌సాగర్ షాట్‌ఫుట్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. 400మీటర్లు, 200మీటర్ల పరుగు పందెంలో ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్టు ఆ పాఠశాల ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడు గంగుల సురేష్ తెలిపాడు. మంగళవారం పాఠశాల విద్యాకమిటీ చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్, ఉపాధ్యాయులు బాబాయి, నాగరత్నం, కె.సుజాత, నాగరమేష్, శ్రీనివాసరావులతో పాటు పలువురు పార్థుని దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు.

'బీవీసీ'లో జాతీయ గ్రంథాలయ దినోత్సవం

అల్లవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం గ్రంథాలయ దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్ మాట్లాడుతూ రంగనాథన్ గ్రంథాలయ నిర్వహణకు సంబంధించిన మౌలిక సూత్రాలు జాతికి అందించారన్నారు. ఆయన లండన్ అసోసియేషన్ ఆఫ్‌గ్రేట్ బ్రిటన్‌లో శాశ్వత సభ్యత్వం పొందారన్నారు. రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పించారు. వివిధ శాఖల అధిపతులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

రాజోలు, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వడిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు మాట్లాడారు. తొలుత రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కళాశాల లైబ్రరీ ఇన్‌చార్జి నారాయణరావు, లైబ్రేరియన్ జగదీష్, చంద్రబోస్, శైలజ, ఎన్.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయి

అల్లవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అందించిన సేవలే ప్రజల్లో మంచి గుర్తింపునిస్తాయని బోడసకుర్రు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అన్నారు. బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి షీల్డులు అందజేశారు. ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ దొమ్మేటి శ్రీశాంతిభవానీ, అడపా శ్రీనివాసరావు, ఓలేటి పరమేశ్వరరావు, అయిల వెంకటనాగేశ్వరరావు, దొమ్మేటి శ్యామ్‌ప్రకాష్, చింతం శ్రీను, మోయిల గణపతిరావు, రోళ్ల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి బొర్రా ఆదిశంకరం, వీఆర్వో యు.చిట్టిబాబు పాల్గొన్నారు.

ఇమామ్ అలీ రజాకు ఘన నివాళి



మామిడికుదురు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎనిమిదవ ఇమామ్ అయిన ఇమామ్ అలీరజాకు ముస్లింలు సోమవారం రాత్రి ఘన నివాళులర్పించారు. మొహర్రం సంతాప కార్యక్రమాల్లో భాగంగా మామిడికుదురు, నగరం, మొగలికుదురు గ్రామాలకు చెందిన ముస్లింలు ఇమామ్‌అలీరజాకు నివాళులర్పించారు. మామిడికుదురులో సర్కిల్ మహ్మద్‌తఖీ స్వగృహంలో, మొగలికుదరులోని పెదపంజాలో మజ్లిస్ జరిగింది. అనంతరం గుమ్మటాన్ని తీసి మాతం చేస్తూ గ్రామంలో ఊరేగింపు చేశారు. మంగళవారం ఉదయం ఇమామ్ అలీరజా పంజాలో సయ్యద్ హదీబాకిరీ ఆధ్వర్యంలో, మొగలికుదరు పెదపంజాలోను షహదత్ మజ్లిస్ జరిగింది. ఇమామ్ అలీరజా వీరమరణం పొందిన సంఘటనను మత ప్రబోధకులు భక్తులకు వివరించగా భక్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'చైతన్యం'లో జనవిజ్ఞానవేదిక పాత్ర కీలకం

ముమ్మిడివరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలను నిరోధించడంలో, సామాజాన్ని చైతన్య పరచడంలో జనవిజ్ఞానవేదిక పాత్ర కీలకమైందని ముమ్మిడివరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఎల్ ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జనవిజ్ఞానవేదిక సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రశాంతి, లెక్చరర్లు అందరూ సభ్యులుగా చేరారు. ఈసందర్భంగా జనవిజ్ఞానవేదిక గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ, కోలా వెంకటేశ్వరరావు, చెకుముకి కన్వీనర్ నేరుడుమిల్లి అబ్బులు పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

కాట్రేనికోన, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మావుళ్ళమ్మ ఆలయ ఆవరణలోని సిద్ధివినాయకునికి మంగళవారం భక్తుల ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఫణికాంత్‌శర్మ నిర్వహణలో సంకష్టహర చతుర్థి పూజలు జరిగాయి. పంచామృతాభిషేకం, గరికజలాభిషేకం, అలంకరణ, అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆణివిళ్ళ సాయిబాబా, రామకృష్ణపరమహంస, యల్లమిల్లి రమేష్, దొంగ ఉదయవెంకటరమణ, ర్యాలి బద్రి, గ్రంధి నారాయణమూర్తి, గ్రంధి రాంప్రసాద్, చెరుకు కృష్ణ, సంసాని పాండురంగారావు, చెరుకు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మామిడికుదురు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్రతీ ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అమలాపురం డీఎల్పీవో బొజ్జిరాజు కోరారు. మంగళవారం ఆయన మాకనపాలెం, మామిడికుదురు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎక్కడా చెత్త కనపడకూడదని, సిబ్బంది సంపూర్ణ పారిశుధ్యమే ధ్యేయంగా పనిచేయాలని, చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్, సీహెచ్ చరణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి నులిపురుగుల నివారణ మాత్రలు

మామిడికుదురు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ప్రభుత్వం నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తోందని నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగానగరం హైస్కూలులో విద్యార్థులకు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. పిల్లల్లో నులిపురుగులు ఉంటే కనపడే లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బళ్ల నరసింహారావు తెలియచేశారు. పీఎంసీ కమిటీ చైర్మన్ జాలెం ఉమాభారతి, సీహెచ్‌వో సత్యవతి, ఉపాధ్యాయులు, యల్లమిల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఐ.పోలవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నులిపురుగు నివారణ మాత్రలతో శారీరక, మానసిక లోపాలను నివారించవచ్చని జిల్లా ప్రోగ్రాం అధికారి ఎన్.రవి అన్నారు. మంగళవారం మురమళ్ళ హైస్కూల్లో నులిపురుగు మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. కేశనకుర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి ఎంఎస్ రాజేష్‌బాబు, డాక్టర్ జీయా నాగవర్ష ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీవో డీఎల్ఎస్ శర్మ, ఎంఈవో ఎన్.కొండారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో ఎం.వెంకటేశ్వర్లు, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.రమేష్‌తో పాటు ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా విశ్వేశ్వరాయపురం

మలికిపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దనున్నట్టు సర్పంచ్ సీహెచ్ హెలీన తెలిపారు. మంగళవారం ఇంటింటా తిరిగి స్వచ్ఛ భారత్ లక్ష్యాలను వివరించామన్నారు. కార్యదర్శి సీతారాముడు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఎవరి ఆర్థిక వివరాలు వారి చేతుల్లోనే'

ఉప్పలగుప్తం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మన లెక్కలు- మన పొదుపు యాప్ ద్వారా ఎవరి ఆర్థిక వ్యవహారాలు వారి చేతుల్లోనే ఉంటాయని లీగల్ కో ఆర్డినేటర్ ప్రసాద్ అన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు ఆర్థిక వ్యవహారాల్లో భరోసా కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం రూపొందించిన మన లెక్కలు- మన పొదుపు యాప్‌పై ఉప్పలగుప్తం మండల సమాఖ్య కార్యాలయంలో ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. 1,563సంఘాలకు మొబైల్ బుక్‌కీపింగ్ 2.ఒ ద్వారా ఈఏడాది మార్చి31నాటికి పొదుపు నిల్వ, రుణవివరాలు నమోదుకు యాప్ ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అయితాబత్తుల సురేంద్రబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

క్లాత్ బ్యాగ్స్ వాడాలి

అంబాజీపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): క్లాత్ బ్యాగులను వాడాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఇసుకపూడి మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు 800క్లాత్ బ్యాగులు, మునుకుట్ల రాముడు కుటుంబ సభ్యులు 200క్లాత్ బ్యాగులను సమకూర్చారు. వీటిని సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు ఆధ్వర్యంలో గ్రామస్తులకు పంపిణీ చేస్తారని డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్ తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది యువతే



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న మంత్రి సుభాష్, సినీ హీరో రోహిత్

ద్రాక్షారామ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది యువతేనని సినీ హీరో నారా రోహిత్ అన్నారు. మంగళవారం రామచంద్రపురం మండలం చోడవరం విజయ ఫంక్షన్ హాలులో అంతర్జాతీయ యువజనోత్సవం సందర్భంగా నిర్వహించిన కోనసీమ యూత్ సెమిస్ట్ 2025లో ఆయన ప్రసంగించారు. యువత రాజకీయాల్లోకి వచ్చి దేశ ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడాలన్నారు. కష్టంతో కాకుండా ఇష్టంతో ముందుకు సాగాలని అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. అంతర్జాతీయ యువజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, మంత్రి సుభాష్‌లను రోహిత్ అభినందించారు. మంత్రి మాట్లాడుతూ గడచిన ఐదేళ్ల లో యువతకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అనతి కాలంలో 109 పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. పది లక్షల కోట్లు పెట్టుబడులతో 8 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా 43 జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించామన్నారు. మహిళలకు ఉపాధి రంగాల్లో శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హీరో రోహిత్, మంత్రి సుభాష్‌లు యువకులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, అక్కల రిష్వంత్ రాయ్, కూటమి నాయకులు, మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు, అధిక సంఖ్యలో విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



సోమేశ్వరంలో ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న కూటమి నాయకులు

పైడితల్లి, దేశాలమ్మ అమ్మవార్లకు ఎమ్మెల్యే పూజలు

రాయవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం నాగవంశీయుల పేటలో వెలసిన పైడితల్లి, దేశాలమ్మ అమ్మవారి సంబరాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యేను ఉత్సవ నిర్వాహకులు, కూటమి నాయకులు సత్కరించారు. సంబరాన్ని పురస్కరించుకుని అమ్మవార్ల ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఎమ్మెల్యే వెంట రెడ్డి ప్రసాద్, టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, కనకాల సత్యనారాయణ, జగ్గిన రాజు, జాడా శ్రీనివాసరావు, అంబవరపు సత్యనారాయణ, బొల్లె లక్ష్మణ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





పోలమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు. పక్క చిత్రంలో ఆలయం వద్ద పారాయణ చేస్తున్న మహిళలు

వైభవంగా పోలమ్మ అమ్మవారి ఆవిర్భావ పూజలు

రాయవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాయవరంలోని శ్రీపోలమ్మ అమ్మవారి ఆవిర్భావ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. విజయనగరం జిల్లా వసంత గ్రామం నుంచి సుమారు 250 ఏళ్ల క్రితం వలస కూలీలతో అమ్మవారు గ్రామంలో వెలసిందని గ్రామస్థులు చెబుతారు. అప్పటి నుంచి శ్రావణ మాసం మూడవ మంగళవారం రోజున అమ్మవారు వెలసిన సందర్భంగా ఆవిర్భావ పూజలను పోలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఎంపీపీ నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు, విష్ణు సహస్రనామ పారాయణ, భగవద్గీత 18 అధ్యాయాల పారాయణ, అమ్మవారికి ఏకాహ భజనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించారు.

పొలాల్లో జింక్ లోపం లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

రాయవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జింక్ లోపం గుర్తించిన పొలాల్లో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కేవీస్ రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని చెల్లూరు గ్రామంలో రైతులకు జింక్ లోపంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కడిమి బాబూరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఎ.శివశంకర్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పూర్తి చేయాలి

కపిలేశ్వరపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో ఆర్.మోహన్ అన్నారు. మండలంలోని కోరుమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం స్వామిత్వ సర్వేపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, కార్యదర్శి కామేశ్వరరావు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,97,191 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఆళ్వార్ సన్నిధిలో కళాపకర్షణ: వాడపల్లి ఆలయంలో మంగళవారం ఆళ్వార్ సన్నిధిలో కళాపకర్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆదాయం రూ.2.97 లక్షలు

తూర్పు, దక్షిణ, ఉత్తర ద్వారాలను వెడల్పు చేసే కార్యక్రమంలో భాగంగా దీన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, మండపారాధన, నవ కలశారాధన, రామానుజ ఆళ్వార్‌కు అభిషేకం, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, కళాపకర్షణ కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వీటి ఏర్పాట్లను ఉపకమిషనరు సూర్యచక్రధరరావు పర్యవేక్షించారు.

రాయవరం, వెదురుపాకల్లో గ్రామసభలు

రాయవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపాలని కోరుతూ రాయవరం, వెదురుపాక గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు చంద్రమళ్ల రామకృష్ణ, మల్లిడి సూరారెడ్డి అధ్యక్షతన గ్రామసభలు జరిపారు. రాయవరంలో గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామసభల్లో మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరిలో విలీనం చేయాలని తీర్మానాలు చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభలో కార్యదర్శి దాసరి సత్యనారాయణ, కొప్పూరి చంటిరెడ్డి, వడ్డాది చిన్న కృష్ణంరాజు తదితరులతోపాటు, భవన నిర్మాణ, ప్లంబర్స్ యూనియన్, ఎలక్ట్రీషియన్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడి జయంతి

మండపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పితామహుడు స్వర్గీయ ఎస్ఆర్ రంగనాథ్ జయంతిని మండపేట శాఖ గ్రంథాలయంలో మంగళవారం జరిపారు. గ్రంథాలయాల ఏర్పాటుకు ఆయన చేసిన సేవలు మరువలేనివని గ్రంథాలయ అధికారి పూర్ణమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠకులతో పాటు గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 300 మంది రోగులకు పరీక్షలు

మండపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.టీ.టీ.వి శ్రీనివాసరావు నేతృత్వంలో రాజమండ్రికి చెందిన శ్రీకర రోబోటిక్ మల్టీస్పెషాల్టీ హాస్పిటల్ డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి, రమా డెంటల్ ఆసుపత్రి వైద్యుల సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో 300 మందికి వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులతోపాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పలు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఘనంగా ఏకాహం

ఆత్రేయపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ర్యాలి వేణుగోపాలస్వామి ఆలయంలో నాగభూషణం సంకీర్తన భజన సమాజం ఆధ్వర్యంలో మంగళవారం 30 మంది భజన కళాకారులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకూ అర్ధ ఏకాహం నిర్వహించారు. ర్యాలికి చెందిన భజన కళాకారుల ఏకాహంలో భక్తులు పాల్గొన్నారు.



ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్యులు



కె.గంగవరం మండలం పామర్రులో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



రాయవరం మండలం సోమేశ్వరంలో విద్యార్థికి నులిపురుగు నివారణ మందు వేస్తున్న దృశ్యం

విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

• నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీలో అధికారులు • విద్యార్థులకు మాత్రలు వేసిన వైద్యులు, సిబ్బంది

ఆలమూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని వక్తలన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో చిన్నారులకు నులిపురుగుల నివారణకు (ఆల్బెండజోల్) మాత్రలను పంపిణీ చేశారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో బి.అప్పాజీ అధ్వర్యంలో పెదపళ్ల వైద్యులు డి.సాయికిశోర్ విద్యార్థులకు నులిపురుగుల అనర్థాలను వివరించి మాత్రలను వేశారు. పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో మొదటి రోజు 5,174 మంది విద్యార్థులకు అందించామని వారు తెలిపారు. ఒకటి నుంచి 18ఏళ్లలోపు బాలబాలికలకు వీటిని పంపిణీ చేస్తున్నట్టు వైద్యులు సాయికిషోర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.భాగ్యశ్రీ, హెచ్ఈవో రాజా అక్కుల, సీహెచ్‌వో ఎంఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): నులిపురుగు నివారణకు విద్యార్థులందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించాలని మలేరియా జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం దంగేరు ఆసుపత్రి పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీని పరిశీలించారు. దంగేరు పరిధిలో 96 శాతం మంది పిల్లలకు మాత్రలు మింగించినట్టు తెలిపారు. పామర్రు ఆసుపత్రి వైద్యుడు వర్ధన్ పర్యవేక్షణలో నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ జరిపారు. ఎంఈవో ఏ.నాగరాజు శివలలో ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగుల నిర్మూలన నిర్వహిస్తున్నామని ఎంఈవో-2 వై.సూర్యనారాయణ అన్నారు. మంగళవారం రాయవరం రాజరాజేశ్వర కాలనీ ప్రాథమిక పాఠశాలలో జాతీయ నులిపురుగు నిర్మూలనను పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ నిర్వహించారు. వైద్యుడు అనిరుధ్ మాట్లాడుతూ విద్యార్థులంతా తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని సోమేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్, ఎల్లే కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీ పరిధిలో విద్యార్థులు, చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. 1 నుంచి 19 ఏళ్లలోపు వయసు గల వారికి 3,865 మంది లక్ష్యం కాగా వీరిలో 3,528 మంది పిల్లలకు మాత్రలను మింగించి 91.3 శాతం పూర్తి చేసినట్టు వైద్యాధికారి రత్నకుమారి, ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు తెలిపారు. అంగర ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు మాత్రలు పంపిణీని ప్రారంభించారు. చేతులు పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొని సహకరించిన ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ రామారావు, హెచ్‌వీ మేరీమణి, హెచ్ఎస్ నానిబాబు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం మండలం తాతపూడి అంగన్‌వాడీ కేంద్రంలో మాత్రలు వేస్తున్న ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు



వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపిన దృశ్యం

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రావులపాలెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. రావులపాలెంలోని అలివేలు మంగ పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

సహకార సంఘాల త్రిసభ్య కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే వేగుళ్ల హితవు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన సహకార సంఘాల త్రిసభ్య కమిటీ సభ్యులు రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. తన చాంబర్‌లో మంగళవారం నియో జకవర్గ పరిధిలో గల 21 సహకార సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, సీఈవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఈ సందర్భంగా పలు అంశాలపై సమీక్ష నిర్వహించి ఆయా సంఘాల సీఈవోలను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది సీఈవోలు పనితీరు పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సహకార సంఘాల పనితీరు మెరుగుపరుచుకోవాలని సహకార సంఘాలపై సంఘ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు అవగాహన పెంచుకోవాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్ కోరారు. జిల్లా సహకార సంఘ అధికారులు కూడా సభ్యులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలో గల 21 సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సీఈవోలతోపాటు జిల్లా సహకార సంఘ డీసీవో రాధాకృష్ణ, రామదాసు కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ అధ్యాపకులు ఎ.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, వ్యవసాయ మండల అధికారులు బలుసు రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెలగతోడు సహకార సంఘ కార్యదర్శిని సత్కరించిన ఎమ్మెల్యే: వెలగతోడు వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం జిల్లాలో ఉత్తమ సంఘంగా ఎంపికై అవార్డు దక్కించుకుంది. అక్కడ పనిచేస్తున్న సీఈవో వంకా కృష్ణ మూర్తిని ఎమ్మెల్యే వేగుళ్ల మంగళవారం అభినందించి సత్కరించారు. జిల్లాలో ఉత్తమ సహకార సంఘంగా ఎంపికై అవార్డు దక్కిన నేపథ్యంలో సీఈవోను అభినందిస్తూ ఎమ్మెల్యేతో పాటు, సహకార సంఘ జిల్లా అధికారులు తదితరులు సత్కరించారు.

నేడు మండల ప్రజా పరిషత్ అత్యవసర సమావేశం

రాయవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజా పరిషత్ అత్యవసర సమావేశం 13న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన తెలిపారు. మంగళవారం రాయవరంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఎంపీపీ నౌడు వెంకట రమణ అధ్యక్షతన ఉదయం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపాలని కోరుతూ తీర్మానంతో పాటు ఇతర అంశాలపై చర్చించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.



పాఠశాల భవనం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

పాఠశాల భవనం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

మండపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వ వార్డులో అసంపూర్తిగా నిలిచిపోయిన వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ పాఠశాల భవనం పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. వీటి పనులను రూ.15 లక్షలతో చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారు

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. శ్రావణ మంగళవారం సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కాళ్లకూరి సూరిపండు అధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, పువ్వులు, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సమరయోధుల స్థూపం వద్ద బీజేపీ శ్రేణుల నివాళి

ఆత్రేయపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా హర్‌ఘర్ తిరంగ వారోత్సవాలను దేశ వ్యాప్తంగా నిర్వహించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పిలుపు మేరకు వాడపల్లిలో స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం వద్ద నివాళులర్పించారు. మంగళవారం బీజేపీ మండల అధ్య క్షుడు ఉమిడిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ అల్లు భాస్కరరావు, యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి కాలా బత్తుల చిన్నారి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తాడాల సుబ్రహ్మణ్యం, ఓబీసీ కన్వీనర్ గూడవల్లి రాంబాబు, పడాల నాగేశ్వరరావు, కామేశ్వర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లిలో పోరాట యోధుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

నేడు రైతు సంబరాలు

ఆలమూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి మద్దతుగా ఆలమూరులో బుధవారం రైతు సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు తెలిపారు. చొప్పెల్ల నుంచి ఆలమూరు వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి ఆలమూరు మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద జరిగే రైతు సంబరాల కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీ హరీష్ మాధురి, కూటమి నాయకులు రెడ్డి అనంతలక్ష్మి, బండారు శ్రీనివాస్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొంటారని వారు వివరించారు. కూటమి నాయకులు, రైతులు అధిక సంఖ్యలో వచ్చి దీన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

గోదావరి పుష్కరాలకు
దేవాలయాల ఆధునికీకరణపై దృష్టిపెట్టండి

ఎమ్మెల్యే బండారు సమీక్ష



దేవదాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ప్రముఖ దేవాలయాల ఆధునికీకరణపై దేవదాయశాఖ అధికారులు దృష్టిపెట్టాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. మంగళవారం వాడపాలెంలో ఆయన కార్యాలయంలో జిల్లా దేవదాయ శాఖాధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన దేవాలయాలున్న నేపథ్యంలో ప్రస్తుత దేవాలయాల పరిస్థితి పునర్నిర్మాణం, మరమ్మతులు, పెయింటింగ్ ఆధునీకరణ వంటి సౌకర్యాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖాధికారి సత్యనారాయణ, డీఈ ఉదయ్‌కుమార్, ప్రముఖ దేవాలయాల ఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు రూపొందించిన పీ-4 కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు కోరారు. మంగళవారం వాడపాలెంలోని తన కార్యాలయంలో పీ-4 విజయవంతంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బంగారు కుటుంబాలు పీ-4 పోర్టల్ ద్వారా ఎంపిక చేయడానికి దత్తత ప్రక్రియపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి బీవీ రమణ, డీఎల్‌డీవో ఎస్టీవీ రాజేశ్వరరావు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



దొరికిన సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్ఐ నరేష్

సెల్‌ఫోన్స్ రికవరీ

ఆలమూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆలమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఏడు సెల్‌ఫోన్లను రికవరీ చేసి లబ్ధిదారులకు అందించినట్లు ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. దొరికిన సెల్‌ఫోన్‌ను మంగళవారం మడికి గ్రామానికి చెందిన జి.శ్రీనుకు అందించారు. వారం రోజుల వ్యవధిలో ఏడు సెల్‌ఫోన్లు లబ్ధిదారులకు అందించామన్నారు. సెల్‌ఫోన్‌లు చోరీ జరిగినప్పుడు క్రైమ్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన యాప్‌లో ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేసి ఫోన్ రికవరీ చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. మొబైల్‌ను పోగొట్టుకున్న బాధితులు రికవరీ కోసం యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు : ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి

మండపేట, ఆగస్టు, 12(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని రామచంద్రపురం ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి పిలుపు నిచ్చారు. మండపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోగల ఇప్పనపాడులో మంగళవారం మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు తెలిపారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు బానిసలై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ కిషోర్, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.



ఇప్పనపాడు సభలో మాట్లాడుతున్న దృశ్యం



కోట ఉన్నత పాఠశాలలో పరీక్షలు పరిశీలిస్తున్న ఏఎంవో రాంబాబు

మారిన నిబంధనల ప్రకారం నిర్వహించాలి

కె.గంగవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎఫ్ఏ1 పరీక్షలు మారిన నిబంధనల ప్రకారం నిర్వహించాలని సర్వశిక్షా ఏఎంవో రాంబాబు అన్నారు. మంగళవారం ఆయన కోట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. కొత్త నిబంధనల ప్రకారం విద్యార్థులు బుక్‌లెట్‌లో జవాబులు రాస్తారు. ఈ విధానాన్ని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వారు పేర్కొన్నారు.